
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
మంగళవారం 17 జూన్ 2025



పాఠశాల స్థలం కబ్జా!

చిలకలపూడి సెంటరులో 40 సెంట్లు ఆక్రమణ

చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టిన అక్రమార్కులు

- స్థలం విలువ ఆరు నుంచి ఏడు కోట్ల రూపాయలు
- ఆక్రమణపై అధికారులకు జనసేన నాయకుల ఫిర్యాదు



చిలకలపూడి ప్రధాన కూడలిలో పాఠశాల స్థలం చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ

జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలోని చిలకలపూడి ప్రధాన కూడలిలో కోట్ల రూపాయల విలువ చేసే 40 సెంట్ల ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కొంద రు అక్రమార్కులు కబ్జా చేశారు. స్థలం చుట్టూ రెండు రోజులుగా ప్రహరీ నిర్మాణ పనులు చేస్తున్నారు. ఆక్రమణ లను అడ్డుకోవాలని జనసేన నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : చిలకలపూడి సెంటరులోని 40 సెంట్లు స్థలంలో ఆనంద్ అనే వ్యక్తి ఏహెచ్ ఎయిడెడ్ పాఠశాలను 1975లో ప్రారంభించారు. గత 15 సంవత్సరాల వరకు ఈ పాఠశాలలో తరగతులు నిర్వహించారు. పాఠశాలను నడిపిన ఆనంద్, హెచ్ఎంగా పనిచేసిన ఆయన భార్య మరణించారు. వీరికి సంతానం లేకపోవడంతో వీరి మరణం అనంతరం పాఠశాల మూతపడింది. అప్పటి నుంచి ఈ పాఠశాల స్థలం ఖాళీగానే ఉంటోంది. ఇటీవల కాలంలో కొందరు ఈ స్థలం కొనుగోలు చేసినట్లుగా చూపి, ముగ్గురి నుంచి నలుగురు చేతులు మారినట్లుగా రికార్డులు సృష్టించి, రిజిస్ట్రార్ కార్యాలయంలో దొంగ రిజిస్ట్రేషన్ కూడా చేయించినట్టు సమాచారం. ఇటీవల కాలంలో అక్కడున్న చికెన్ షాపును, ఇతరత్రా చిన్నపాటి వ్యాపారులను ఖాళీ చేయించారు.

రెవెన్యూ రికార్డుల్లో ఉన్నా..

50 ఏళ్ల క్రితం వరకు చిలకలపూడి, సర్కారుతోట ప్రాంతాలు రిజర్వు ఫారెస్ట్ భూములుగా ఉండేవి. ఈ రెండు ప్రాంతాల్లో వేలాది మంది నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉండటంతో భవిష్యత్తులో వారికి ఇళ్ల స్థలాల విషయంలో ఇబ్బందులు రాకుండా అప్పట్లో నివాసం ఉంటున్న వారి నుంచి చదరపు గజం భూమికి ఒక రూపాయి చొప్పున నగదు కట్టించుకుని ఇళ్లస్థలాలుగా అప్పటి ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. అయితే ఈ రెండు ప్రాంతాల్లోని భూములు 22-ఎలో ఉండిపోవడంతో క్రయవిక్రయాల సమయంలో రిజిస్ట్రేషన్‌లు జరిగేవి మిగతా 6లో..

పరిశీలించి చర్యలు తీసుకుంటాం
కమిషనర్, తహసీల్దార్

చిలకలపూడి సెంటరులోని పాఠశాల స్థలాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు, నార్త్ తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. ఈ స్థలం వద్దకు సిబ్బందిని పంపి పూర్తిస్థాయి వివరాలు తెలుసుకుంటామని పేర్కొన్నారు.

దివ్యాంగుడి బియ్యాన్ని బొక్కేశారు!

గుడ్లవల్లేరు మండలం డోకిపర్రులో రేషన్ డీలర్ నిర్వాకం



దివ్యాంగుడు వక్కలగడ్డ శ్రీకాంత్

- 2016లో వక్కలగడ్డ శ్రీకాంత్‌కు అంత్యోదయ కార్డు మంజూరు
- 35 కేజీల బియ్యానికి ఐదు కేజీలే ఇచ్చి సరిపెట్టిన రేషన్ డీలర్
- కూటమి ప్రభుత్వం ఈ నెలలో 35 కేజీలు ఇవ్వడంతో బయటపడ్డ డీలర్ మోసం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం

ఈ ఫొటోలో కనిపిస్తున్న దివ్యాంగుడి పేరు వక్కలగడ్డ శ్రీకాంత్. గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామం. కాళ్లు, చేతులు సక్రమంగా లేకపోవడంతో నడవలేడు.. పనిచేయలేడు. తల్లిదండ్రులు కూడా లేరు. స్థానిక దాతృత్వంతో జీవనం సాగిస్తున్నాడు. ప్రభుత్వం 2016లో అంత్యోదయ అన్నయోజన బియ్యం కార్డును మంజూరు చేసింది. శ్రీకాంత్‌కు నెలకు 35కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉండగా, డోకిపర్రు రేషన్ డీలర్ కేవలం ఐదుకిలోల బియ్యం మాత్రమే ఇస్తూ వచ్చాడు. అదేమని ప్రశ్నిస్తే ప్రభుత్వం ఒక్కరికి ఐదు కిలోల బియ్యం మాత్రమే ఇచ్చేందుకు అనుమతులు ఉన్నాయని బుకాయించాడు. సరిగా మాట్లాడలేని శ్రీకాంత్ ఇంతకాలంగా ఐదు కిలోల బియ్యం మాత్రమే తీసుకుని సరిపెట్టుకు న్నాడు. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనం ద్వారా బియ్యం పంపిణీ జరిగింది. శ్రీకాంత్‌కు నెలకు కేవలం ఐదు కిలోల బియ్యం మాత్రమే ఇవ్వాలని రేషన్ డీలర్ చెప్పడంతో ఎండీయూ ఆపరేటర్ కూడా అలాగే ఇస్తూ వచ్చాడు. కాగా, కూటమి మిగతా 6లో..

కబళించిన కడలి

వేటకు వెళ్లిన ఇద్దరు మత్స్యకారులు మృతి

- తీవ్ర గాయంతో మరో వ్యక్తి ఆస్పత్రిపాలు
- కోనసీమ జిల్లా అంతర్వేది వద్ద ఘటన
- మృతులది నాగాయలంక మండలం





తమ్ము పోతురాజు, నాగిడి రాము (ఫైల్)

నాగాయలంక /అవనిగడ్డ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వేట నిషేధం ముగిసిందనే ఆనందంతో సముద్రంపై వేటకు వెళ్లిన ఇద్దరు మత్స్యకారులను కడలి కబళించిన ఘటన కోనసీమ జిల్లా అంతర్వేది వద్ద సోమవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే... కృష్ణాజిల్లా నాగాయలంక మండలం గుల్లలమోద, సంగమేశ్వరం గ్రామాలకు చెందిన ఆరుగురు మత్స్యకారులు గుల్లలమోద గ్రామం నుంచి ఆదివారం రాత్రి సముద్రంలో వేటకు వెళ్లారు. కోనసీమ జిల్లా అంతర్వేది వద్ద ఒక్కసారిగా పెనుగాలులు వీస్తూ, అలలు ఎగసిపడటంతో బోటు తిరగబడి మునిగిపోయింది. గుల్లలమోద గ్రామానికి చెందిన నాగిడి రాము(25), సంగమేశ్వరం గ్రామానికి చెందిన తమ్ము పోతురాజు(60) నీటిలో మునిగి చనిపోయారు. బోటు తగిలి నాయుడు వెంకటేశ్వరరావు కాలు విరిగింది. అతనితో పాటు విశ్వనాధపల్లి నాగరాజు, విశ్వనాధపల్లి సామేరు, విశ్వనాధపల్లి సత్యనారాయణ క్షేమంగా ఒడ్డుకు చేరారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి స్వగ్రామాలకు పంపుతామని మత్స్యశాఖ ఏడీ ఆర్.ప్రతిభ తెలిపారు.

శోకసంద్రంలో మత్స్యకార గ్రామాలు

ఇరువురు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లి మృతి చెందటంతో గుల్లలమోద, సంగమేశ్వరం గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. గుల్లలమోద గ్రామానికి చెందిన నాగిడి రాము వేటకు వెళ్లి వారిలో అత్యంత పిన్న వయస్కుడు. 2020లో వివాహం కాగా, ఇరువురు సంతానం. రాము మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

దిగ్ర్భాంతిని కలిగించింది : ఎమ్మెల్యే

మత్స్యకారులు మృతి చెందడంపై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని, క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఆయన అధికారులకు సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వపరంగా అందే సాయాన్ని త్వరగా అందజేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి 8

నోటి లెక్కతో సరి..

స్టాక్ యార్డులో ఇసుక లోడింగ్

జిల్లాలో క్వారీలను మూసివేస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకోవటంతో ఈ నెల 13వ తేదీ నుంచి నార్త్ వల్లూరు, రొయ్యూరు క్వారీల్లో ఇసుక తవ్వకాలను మైనింగ్ అధికారులు నిలిపివేశారు. దీంతో వల్లూరుపాలెం, రొయ్యూరు స్టాక్ యార్డుల నుంచి ఇసుక లోడింగ్ చేస్తున్నారు. నోటి లెక్కతో లారీకి రూ.6 వేలు చొప్పున వసూలు చేస్తూ, నిబంధనలను విస్మరిస్తున్నారు. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- లారీకి రూ. 6 వేలు వసూలు
- నిరుపయోగంగా వే బ్రిడ్జి
- అధికారుల పర్యవేక్షణ శూన్యం
- సర్వత్రా వ్యక్తమవుతున్న విమర్శలు

తోట్లవల్లూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రుతుపవనాల రాకతో భూగర్భ జలాలను పెంపొందించాలన్న లక్ష్యంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇసుక తవ్వకాలను నియంత్రించాలని ఆదేశాలిచ్చింది. దీంతో కలెక్టర్ డీకే బాలాజీ రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఆదేశాలిచ్చి అక్టోబర్ 15వ తేదీ వరకు తీరం వెంబడి అన్ని క్వారీల్లో ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయించారు. వల్లూరుపాలెం స్టాక్ యార్డులో మూడు లక్షల మెట్రిక్ టన్నులకు పైగా, రొయ్యూరులో 1.73 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను ప్రభుత్వం నిల్వ చేయించింది. నదీపాయలో ఇసుక తవ్వకాల నిలిపివేతతో ఈ స్టాక్ యార్డుల్లోని ఇసుకను ప్రజలకు అందిస్తున్నారు. అయితే స్టాక్ యార్డు వద్ద లారీల్లోకి ఇసుక లోడింగ్ నోటి లెక్కలతోనే చేస్తున్నారు. లారీకి రూ.6వేలు వసూలు చేస్తున్నారు. లారీ బాడీని బట్టి ఎన్ని యూనిట్ల ఇసుక పడుతుందో లెక్కకట్టి యూనిట్ ఇసుకకు రూ.వెయ్యి చొప్పున తీసుకుంటున్నట్టు సిబ్బంది చెబుతున్నారు. మరోవైపు స్టాక్ యార్డు వద్ద నిర్వహణ ఖర్చులతో కలిపి మెట్రిక్ టన్ను ఇసుకకు రూ.155 మాత్రమే వసూలు చేయాలని, ఉచిత ఇసుకతో ప్రజలకు భరోసా పెరిగి సొంతింటి కల నెరవేరుతుందని బ్యానర్ ఏర్పాటు చేశారు. బ్యానర్ వరకు బాగానే ఉన్నా ఒక మెట్రిక్ టన్ను ఇసుకను తూకంతో మిగతా 6లో..



స్టాక్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన ధరల పట్టిక



వల్లూరుపాలెం స్టాక్‌యార్డులో లారీల్లోకి ఇసుక లోడింగ్

నదికి వరద రాకుండానే..



స్టాక్‌యార్డు వద్ద నిరుపయోగంగా ఉన్న వే బ్రిడ్జి

గతంలో కృష్ణానదీపాయలకు వరద వచ్చే వరకు నదీపాయల్లో ఇసుక తవ్వకాలు చేసేవారు. నదీపాయల్లో వరద వచ్చాక మాత్రమే స్టాక్ యార్డుల్లో ఇసుకను వినియోగించేవారు. కాని ఇపుడు గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో నదీపాయల్లో వరద నీరు రాకుండానే తవ్వకాలు ఆపేసి స్టాక్‌యార్డులో ఇసుకను ఖాళీ చేస్తున్నారు. నెల నుండి రెండు రోజుల్లో స్టాక్‌యార్డుల్లో ఇసుక ఖాళీ అయితే వరద వచ్చాక ఇసుకను ఎక్కడి నుండి తెస్తారనే వాదన వినిపిస్తోంది.

కొండపల్లి కోట టీడీపీదే..

మూడున్నరేళ్ల నిరీక్షణకు తెరపడింది. కొండపల్లి మున్సిపల్ చైర్మన్ పీఠం టీడీపీ వశమైంది. 2021, నవంబరు 24నే తేలాల్సిన చైర్మన్ ఫలితం అప్పట్లో అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ ఆడిన తొండాటకు కోర్టు వరకూ వెళ్లగా, ఇప్పటికి టీడీపీకి న్యాయం జరిగింది.

మూడున్నరేళ్ల నిరీక్షణకు ముగింపు



చైర్మన్ చిట్టిబాబు, వైస్ చైర్మన్లు శ్రీనివాసరావు, విజయలక్ష్మి

- నాడు వైసీపీ ఆడిన దొంగాటకు తెర
- చైర్మన్‌గా టీడీపీ నేత చిట్టిబాబు ప్రకటన
- వైస్ చైర్మన్లుగా విజయలక్ష్మి, శ్రీనివాసరావు
- ప్రమాణస్వీకారం చేయించిన ఆర్డీవో

ఇబ్రహీంపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో 2021లో జరిగిన కొండపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో నాడు ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ హోరాహోరీగా పోరాడింది. 29 వార్డులకు 14 టీడీపీ, 14 వైసీపీ, ఒకటి స్వతంత్ర అభ్యర్థికి దక్కాయి. ఆ తర్వాత స్వతంత్ర అభ్యర్థి టీడీపీలో చేరడంతో ఆ పార్టీ బలం 15కు చేరింది. అప్పట్లో వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న వసంత వెంకట కృష్ణప్రసాద్ ఎక్స్‌అఫిషియస్ ఓటు వైసీపీకి వేయడంతో ఆ పార్టీ బలం 15 అయ్యింది. అలాగే, నాటి టీడీపీ ఎంపీ కేశినేని నాని ఎక్స్‌అఫిషియస్ ఓటుతో ఆ పార్టీ బలం 16కు చేరింది. దీంతో చైర్మన్ పీఠం టీడీపీదేనని అంతా భావించారు.

నాడు వైసీపీ తొండాట

ఈ నేపథ్యంలో నాటి ఎంపీ కేశినేని నాని ఓటు చెల్లదని వైసీపీ కోర్టును ఆశ్రయించింది. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికైతే జరిపారు కానీ, ఫలితాన్ని తేల్చలేదు. మూడున్నరేళ్ల తర్వాత హైకోర్టు నుంచి వచ్చిన సీల్డ్ కవర్‌లోని ప్రొసీడింగ్స్‌ను ఎన్నికల అధికారి, విజయవాడ ఆర్డీవో కె.చైతన్య సోమవారం మున్సిపల్ కార్యాలయంలో టీడీపీ, వైసీపీ సభ్యుల సమక్షంలో చదివి వినిపించారు. టీడీపీ చైర్మన్ అభ్యర్థి చెన్నుబోయిన చిట్టిబాబుకు 16 ఓట్లు, వైసీపీ చైర్మన్ అభ్యర్థి గుంజా శ్రీనివాసరావుకు 15 ఓట్లు వచ్చినందున చిట్టిబాబు విజయం సాధించినట్లు ప్రకటించారు. అలాగే, వైసీపీ అభ్యర్థుల కంటే ఒక ఓటు ఎక్కువగా రావడంతో టీడీపీ వైస్ చైర్మన్ అభ్యర్థులు కరిమికొండ విజయలక్ష్మి, చుట్టుకుదురు శ్రీనివాసరావులు కూడా విజయం సాధించారు. ఎంపీ ఓటు చెల్లదని, చెరి సమానంగా ఓట్లు ఉన్నాయని, టాస్ వేస్తే చైర్మన్ పదవి తనకు దక్కుతుందని ఆశ పెట్టుకున్న వైసీపీకి ఈ ఫలితం రుచించలేదు. చైర్మన్, మిగతా 6లో..



కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబుకు నియామక పత్రాన్ని అందిస్తున్న ఆర్డీవో కె.చైతన్య, పక్కనే ఎమ్మెల్యే వసంత

టీడీపీ సంబరాలు

మూడున్నరేళ్ల నిరీక్షణ ఫలించి కొండపల్లి మున్సిపాలిటీ టీడీపీకి దక్కడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. మున్సిపల్ కార్యాలయానికి భారీగా చేరుకుని కొత్త పాలకవర్గానికి అభినందనలు తెలిపి, భారీ ఊరేగింపు నిర్వహించారు.

నేడు నాగాయలంకలో జలయోగాంధ్ర

- నదిపై తేలియాడుతూ యోగాసనాలు వేయనున్న క్రీడాకారులు
- శ్రీరామపాదక్షేత్రంలో ఏర్పాట్లు

8





విమానాశ్రయం ఎదురుగా భారీ కన్వెన్షన్ సెంటర్!

- రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపిన గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ
- నిధులు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి

8

తల్లికి వం'ధనం'



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల తల్లుల బ్యాంకు, పోస్టాఫీసు ఖాతాల్లో వేసిన తల్లికి వందనం పథకం నగదు డ్రా చేసుకునేందుకు గుడివాడలో సోమవారం తల్లులు పోటెత్తారు. దీంతో బ్యాంకులు, పోస్టాఫీసులు కిటకిటలాడాయి. గంటల తరబడి క్యూలో నిలబడి నగదు డ్రా చేసుకుని వెళ్లారు.



సేవా బృందాల సమావేశంలో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్

అమ్మ సన్నిధిలో సేవకులే సారధులు

» దుర్గగుడి ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దేవదాయ శాఖ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, దేవదాయ కమిషనర్ ఆదేశాల ప్రకారం కనకదుర్గమ్మ సన్నిధిలో నిస్వార్థంగా ఉచితసేవ చేసే సేవకులు, భక్త బృందాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి భక్తుల సేవలో వినియోగిస్తామని ఈవో వీకే శీనానాయక్ తెలిపారు. సోమవారం మహామండపం ఆరో అంతస్తులో సేవాబృందాలతో ఈవో సమావేశమయ్యారు. భక్తులకు తాగునీరు అందించడం, అన్నప్రసాద వితరణ, ఉచిత ప్రసాద వితరణ, దర్శనం క్యూలైన్ల నిర్వహణ, క్లోక్ రూమ్, చెప్పుల స్టాండ్, మొబైల్ భద్రపరచే ప్రదేశం, భక్తుల ఫీడ్ బ్యాక్ కౌంటర్, లిఫ్ట్ క్యూ వద్ద, దేవస్థానం బస్ క్యూ వద్ద, పార్కింగ్, టోల్ గేట్ వద్ద వాహనాల క్రమబద్ధీకరణ తదితర చోట్ల సేవకులు, భక్త బృందాల సేవలు వినియోగించనున్నట్టు ఈవో పేర్కొన్నారు. సేవకుల రిజిస్ట్రేషన్ నిమిత్తం ఆన్‌లైన్ అప్లికేషన్ సిద్ధం అయిందని, ఆఫ్‌లైన్‌లో కూడా దేవస్థానంలో దరఖాస్తులు స్వీకరించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని, బృందాలుగా వచ్చేవారికి ప్రాధాన్యత ఇవ్వబోతున్నట్టు శీనానాయక్ వెల్లడించారు. తిరుమలలో శ్రీవారి సేవగా ప్రాచుర్యం పొందగా, దుర్గమ్మ ఆలయంలో శక్తిసేవ అని వ్యవహరించాలని, ఈ సందర్భంగా సేవకులు విజ్ఞప్తి చేశారు. తిరుమల తరహాలో వసతి, అన్న ప్రసాదం, లాకర్ సౌకర్యం, సేవకులకు తాత్కాలిక గుర్తింపు కార్డు, వసతి నుండి దేవస్థానానికి రవాణా సదుపాయాలు కల్పించాలని సేవకులు ఈవోను కోరారు. సేవకులే సారధులుగా అమ్మ సన్నిధిలో భక్తులకు సేవలందించే ప్రణాళిక సిద్ధం అయిందని, పారదర్శకమైన వ్యవస్థ రూపొందిస్తున్నామని, భక్తి భావంతో అర్హత కలిగిన వ్యక్తులను సేవకు వినియోగిస్తామని ఈవో వివరించారు.



అమ్మవారి ఆభరణాలను అప్పగిస్తున్న మాజీ ఈవో రామారావు

అమ్మవారి ఆభరణాల అప్పగింత

ఇంద్రకీలాద్రి, : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ బంగారు, వెండి ఆభరణాలను అధికారులు అప్పగించే కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. పూర్వ కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు డిసెంబరు 31న పదవీ విరమణ చేయగా, వారి అధీనంలో ఉన్న బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు ప్రస్తుత కార్యనిర్వహణాధికారి వీకే శీనానాయక్‌కు అప్పగించారు. మంగళవారం దేవస్థానం బ్యాంకు లాకర్లలో ఉన్న వస్తువుల అప్పగింత కార్యక్రమం జరుగుతుందని దేవస్థానం గణాంక విభాగం అధికారులు తెలిపారు.



స్పెషల్ ప్రొటెక్షన్ సిబ్బందితో సమావేశమైన ఈవో

ఆలయ భద్రత విషయంలో రాజీ వద్దు

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రి భద్రత విషయంలో ఎటువంటి రాజీ పడకుండా విధులు నిర్వర్తించాలని స్పెషల్ ప్రొటెక్షన్ పోలీసు సిబ్బందిని ఈవో శీనానాయక్ కోరారు. సోమవారం దేవస్థానంలో విధులు నిర్వర్తించడానికి వచ్చిన స్పెషల్ బ్యాచ్‌తో సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆలయంలో భక్తులతో గౌరవంగా, సిబ్బందితో సమన్వయంతో వ్యవహరించాలని, విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



న్యాయవాదులకు వినతిపత్రం సమర్పిస్తున్న శాతవాహన కళాశాల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు

శాతవాహన రక్షణలో సహకరించండి

» కళాశాల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు

విజయవాడ లీగల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సమస్యల వలయంలో చిక్కుకున్న శాతవాహన కళాశాలపై స్పందించి పరిష్కారానికి న్యాయపరమైన అండదండలు ఇవ్వడం ద్వారా కళాశాలకు పూర్వవైభవం తేవాలని కోరుతూ కళాశాల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు సోమవారం బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషాకు వినతిపత్రం సమర్పించారు. గత పదేళ్లకు పైగా కళాశాల వివాదంలో వుంటూ కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉన్న వివరాలు కొంత మేరకు తమ దృష్టికి వచ్చాయని ప్రస్తుతం కళాశాల భవనాలు కూల్చివేయడం సరైంది కాదని దీనిపై న్యాయపరమైన అండగా వుంటామని భరోసా ఇచ్చారు. పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఉయ్యూరు సాంబిరెడ్డి మాట్లాడుతూ, గడచిన యాభై ఏళ్లలో కళాశాలలో చదివిన విద్యార్థులు న్యాయవాదులు ఉపాధ్యాయులుగా అనేక రంగాల్లో వున్నారన్నారు. కార్యక్రమంలో బార్ పూర్వ అధ్యక్షులు సంపర శ్రీనివాసరావు, హైకోర్టు న్యాయవాది నాగేశ్వరరావు, ప్రచార కమిటీ కన్వీనర్ మోతుకూరి అరుణ్‌కుమార్, పొలిమేర తాతారావు, వల్లూరు నాగబాబు, సైనుద్దీన్, నరేంద్ర, కిరణ్, వేముల శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి వున్నారు.

భర్త హత్య కేసులో భార్య అరెస్టు

చల్లపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యం, మతిస్థిమితం సరిగాలేని భర్తను కర్రతో కొట్టి చంపిన భార్య బోలెం మంగమ్మను చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు సోమవారం అరెస్టు చేశారు. దేవరకోటకు చెందిన బోలెం శ్రీనివాసరావును 20 ఏళ్ల క్రితం వివాహం చేసుకుని పెళ్లయిన కొద్దికాలానికే గొడవపడి వెళ్లిపోయిన మంగమ్మ పింఛన్ సొమ్ముల కోసం మళ్లీ భర్తను తీసుకుని చల్లపల్లి వచ్చేయటం, శనివారం కర్రతో కొట్టడంతో అతడు చనిపోయిన సంగతి తెలిసిందే. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని విచారించటంతో మంగమ్మ కొట్టిన కారణంగానే శ్రీనివాసరావు మృతిచెందినట్టు ధృవీకరించుకు ఆమెపై హత్యకేసు నమోదు చేశారు. నిందితురాలిని సీఐ ఈశ్వరరావు మొవ్వ కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు.

సంతృప్తే లక్ష్యంగా పనిచేయాలి

» అర్జీదారులతో దురుసు ప్రవర్తన వద్దు.. : కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సమస్యలపై వచ్చిన అర్జీలను వివిధశాఖల అధికారులు అవగాహనా లోపంతో సక్రమంగా పరిష్కరించడం లేదని కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ అధికారులను ప్రశ్నిస్తూ.. సమస్యలతో వచ్చిన అర్జీదారులకు సక్రమంగా సమాధానం చెప్పాలని, వారి సంతృప్తే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ప్రజాసమస్యల పరిష్కారవేదిక(మీకోసం) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ప్రజలనుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎవరైనా పింఛనుకోసం దరఖాస్తు చేసుకున్నపుడు త్వరలో మంజూరవుతుందని అర్జీదారునికి సమాధానం తెలియజేయాలని, కానీ అర్జీదారుని పోర్టల్‌లో లబ్ధిపొందినట్టుగా పేర్కొంటున్నారని, ఇది తప్పుడు సంకేతాలను పంపుతోందన్నారు. లబ్ధిపొందినట్టుగా నమోదవుతుండటంతో కాల్ సెంటర్‌నుంచి లబ్ధిదారులకు ఫోన్ చేసి లబ్ధి జరిగిందా, లేదా అనే వివరాలు తెలుసుకుంటున్నారని, దీంతో వారు తమకు ఎలాంటి లబ్ధిజరగలేదని చెబుతున్నారని, దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ పద్ధతిని మార్చుకోవాలన్నారు. లబ్ధిదారుల వద్దకు అధికారులు వెళ్లినపుడు మర్యాదగా మాట్లాడాలని, కిందిస్థాయి ఉద్యోగులతో మాట్లాడిస్తుండటంతో వివిధ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఖాళీ ఎండార్స్‌మెంట్ లబ్ధిదారులకు ఇవ్వవద్దని కలెక్టర్ అధికారులకు సూచించారు. అర్జీదారుల సమస్యలను పరిష్కరించి, వారితో ఫొటోలు దిగి ఉన్నతాధికారులకు పంపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సోమవారం 133మంది వివిధ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఆర్డీవో కె.స్వాతి, మెప్మా పీడీ సాయిబాబు, సర్వశిక్ష పీడీ కుమిదిని సింగ్, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీపీవో జె.అరుణ, డీఎస్‌వో పార్వతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పామర్రులో ఈనెల 18న నిర్వహించే జాబ్‌మేళా పోస్టర్‌ను కలెక్టర్ బాలాజీ, అధికారులు ఆవిష్కరించారు.



అధికారులతో మాట్లాడుతున్న కృష్ణా కలెక్టర్ బాలాజీ, పీజీఆర్ఎస్‌లో ప్రజల సమస్యలు వింటున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ (కింద)



» సమస్య పునరావృతం కాకూడదు : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అర్జీలు పునరావృతం కాకుండా సమస్యను పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బంది నుంచి సమాచారం సేకరించి పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు ఏ స్థాయిలోనూ పునరావృతం కాకూడదని సమస్య పరిష్కారంతో అర్జీదారుడు సంతృప్తి చెందడమే లక్ష్యంగా అధికారులు పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని నెరవేర్చాలని అన్నారు. ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని అర్జీలను ఆడిటింగ్ చేయడం జరుగుతుందన్నారు. అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం తగదన్నారు. తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశతో వచ్చే అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారం చేపాలని, ప్రతి సమస్యను శ్రద్ధగా విని పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మొత్తం 157 అర్జీలను స్వీకరించడం జరిగిందని, ఇందులో 42 అర్జీలను స్వయంగాను, 115 అర్జీలను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించినట్లు జాయింట్ కలెక్టర్ ఇలక్కియ తెలిపారు. అర్జీల స్వీకరణలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఆర్డీఏ పీడీ ఎఎన్‌వి నాంచారరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలి

» ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ విద్యార్థుల డిమాండ్

గవర్నర్‌పేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తొందరపాటు నిర్ణయం వల్ల ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ విద్యార్థులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రస్తుత ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు డిమాండ్ చేశారు. సమాఖ్య రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ విద్యార్థులు తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ లెనిన్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వలరాజు మాట్లాడుతూ, సీఓఏ అనుమతులు కూడా లేకుండా అద్దె భవనాల్లో కోర్సులు ప్రారంభించారని, ఆర్కిటెక్చర్ విభాగానికి సంబంధించి కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్ నుంచి అనుమతులు లేకుండా అడ్మిషన్లు పూర్తి చేశారని ఆరోపించారు. యూనివర్శిటీలో అడ్మిషన్లు పొంది 5 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకూ ఎటువంటి గుర్తింపు లేకుండా తరగతులు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని యూనివర్శిటీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సహకార సిబ్బందికి శిక్షణ తరగతులు ప్రారంభం



కృష్ణలంక, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లాలోని 131 సహకార సంఘాల సిబ్బందికి సంఘాల కంప్యూటరీకరణపై శిక్షణా తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లాలోని 425 సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ కార్యక్రమం పూర్తయిందని, ఇకపై అన్ని సంఘాలు కంప్యూటరీకరణ ద్వారా రైతులకు పారదర్శకమైన, వేగవంతమైన నాణ్యమైన సేవలను అందచేయుటకు సహకార సంఘాలు సంసిద్ధమవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వాట్సాప్ సేవా కార్యక్రమాలు కూడా సహకార సంఘాలకు అనుసంధానం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అదేవిధంగా గతంలో మీ సేవ ద్వారా రైతులకు అందచేయుచున్న రైతుల భూములకు సంబంధించిన వన్ బి, అడంగల్ తదితర పత్రాలను సహకార సంఘాల ద్వారానే అందచేయుటకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీనివాసరెడ్డి, కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ జనరల్ మేనేజర్ ఎన్.రంగబాబు, ఆప్కాబ్ సీటీఐ ప్రతినిధి రమణరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడి బియ్యాన్ని బొక్కేశారు!

(5వ పేజీ తరువాయి)



కలెక్టర్‌బాలాజీకి తన గోడు చెప్పుకుంటున్న దివ్యాంగుడు

ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ డీలర్ మారడంతో ఈ నెలలో శ్రీకాంత్‌కు 35 కిలోల బియ్యం వచ్చాయి. దీంతో అసలు విషయం తెలుసుకున్న బాధిత దివ్యాంగుడు తొమ్మిదేళ్ల నుంచి తనను మోసం చేశారని స్థానికుల సాయంతో కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ బాలాజీకి ఫిర్యాదు చేశాడు. స్పందించిన కలెక్టర్ ఈ విషయంపై వివరాలు ఇవ్వాలని డీఎస్‌వో పార్వతిని ఆదేశించగా, ఆమె ఆన్‌లైన్‌లో పరిశీలించి శ్రీకాంత్ పేరున నెలకు 35 కిలోల బియ్యం ఇస్తున్నట్టుగా ఉందని తెలియజేశారు. దీంతో వెంటనే పాత రేషన్ డీలర్, ఎండీయూ వాహన ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

మానవత్వం చాటుకున్న కలెక్టర్

శ్రీకాంత్ నడవలేని స్థితిలో వీల్‌ఛైర్‌లో కలెక్టరేట్‌కు రావడం గమనించిన కలెక్టర్ బాలాజీ అతడికి బ్యాటరీతో నడిచే మూడు చక్రాల వాహనం అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సేవలను పలువురు ప్రశంసించారు.

టీచర్ల బదిలీలో స్కూల్ అసిస్టెంట్లే ఎక్కువ

మచిలీపట్నం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో టీచర్ల బదిలీల ప్రక్రియలో 4281 మంది బదిలీ అయ్యారు. వీరిలోస్కూల్ అసిస్టెంట్లు ఎక్కువ మంది ఉన్నారు. 1933 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీ కాగా, 1885 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, 110 మంది గ్రేడ్ 2 హెచ్ఎం, 87 మంది బాషా పండితులు, మోడల్ ప్రైమరీహెచ్ఎంలు 217, వ్యాయామ ఉపాధ్యాయులు 24, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లు 27 మంది బదిలీ అయ్యారు. కాగా సోమవారం నిర్వహించిన డీఎస్సీ పరీక్షకు 1435 మందికి గాను 1358 మంది అభ్యర్థులు హాజరయ్యారని డీఈవో తెలిపారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ

మచిలీపట్నం టౌన్ : ప్రైవేటు పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజురాయితీ ఇస్తూ డీఈవో పీవీజే రామారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రి రవీంద్రకు జర్నలిస్టులు వినతిపత్రం ఇచ్చిన నేపథ్యంలో డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్యోగుల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తా

» ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్



గాంధీనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జేఏసీకి కీలకమైన నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ స్పష్టం చేశారు. నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్రకార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో సోమవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. కిందిస్థాయి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో ఎన్జీవో సంఘం పెద్దన్న పాత్ర పోషిస్తుందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 5 వేలకు పైగా నాల్గవ తరగతి ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌ను ఘనంగా సత్కరించారు.

సీమకు రయ్.. రయ్..

» రాయలసీమకు పెరుగుతున్న విమాన సర్వీసులు

» తిరుపతి, కడపలకు ఇప్పటికే సర్వీసులు

» జూలై 2 నుంచి కర్నూలుకు సర్వీసు

» అన్నీ ఇండిగో ఎయిర్‌లైన్స్‌వే



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): బెజవాడ నుంచి రాయలసీమ ప్రాంతాలకు విమానయానం ఊపందుకుంటోంది. ప్రాంతీయ విమానయానంలో విజయవాడ నుంచి రాయలసీమ ప్రాంతానికే ఎక్కువ సర్వీసులు నడుస్తుండటం విశేషం. ఇప్పటికే తిరుపతి, కడపకు విమాన సర్వీసులు నడుస్తుండగా జూలై 2 నుంచి కర్నూలుకు విమాన సర్వీసు ప్రారంభం కాబోతోంది. దీంతో విజయవాడ నుంచి రాయలసీమకు నడిచే విమానాల సంఖ్య మూడుకు చేరనుంది. విజయవాడ నుంచి రాయలసీమకు ప్రస్తుతం నడుస్తున్న తిరుపతి, కడప సర్వీసులను ఇండిగో విమానయాన సంస్థ నడుపుతోంది. కర్నూలుకు కూడా ఇండిగో సర్వీసును నడుపుతున్నట్టు ప్రకటించడమే కాకుండా బుకింగ్‌ను కూడా ప్రారంభించింది. రాయలసీమ ప్రాంతాలకు 90 శాతం పైగా ఆక్యుపెన్సీ ఉండటంతో ఇండిగో సంస్థ వరుసగా ఆ ప్రాంత జిల్లాలకు సర్వీసులు నడిపేందుకు ఆసక్తి చూపుతోంది. అనంతపురం జిల్లాలో పూర్తి స్థాయి విమానాశ్రయం లేదు. పుట్టపర్తిలో సత్యసాయిబాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక విమానాశ్రయం ఉంది. ఈ విమానాశ్రయం కేవలం వీఐపీల కోసం, ట్రస్టుకు సంబంధించి ప్రైవేటు అవసరాలకు మాత్రమే ఉపయోగిస్తున్నారు. అనంతపురం జిల్లాకు ఉన్న డిమాండ్ రీత్యా ఈ విమానాశ్రయాన్ని తాత్కాలికంగా అయినా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అనంతపురం జిల్లాలో కొత్త విమానాశ్రయ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చింది. దీనికి కేంద్ర పౌర విమానయాన సంస్థ కూడా ఆమోదముద్ర తెలిపింది. ఈ విమానాశ్రయ నిర్మాణానికి 1200 ఎకరాల భూములు అవసరం కాగా.. సేకరణ ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భూములను సేకరించి నూతన విమానాశ్రయం నిర్మించే వరకైనా పుట్టపర్తి ట్రస్ట్ అధీనంలో ఉన్న ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా పౌర విమానయానానికి కూడా ఉపయోగించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రాయలసీమకు సర్వీసులు ఎందుకు పెరుగుతున్నాయి ?

బెజవాడ నుంచి రాయలసీమ ప్రాంతానికి రోడ్డు మార్గం చాలా దూరం. రైల్వే అనుసంధానం ఉన్నా.. తగిన సంఖ్యలో రైళ్లు లేవు! ఈ కారణంగా విమానయానం ఊపందుకుంటోంది. రోడ్డు, రైలు మార్గాలతో పోల్చుకుంటే రాయలసీమ ప్రాంతాలకు విమానయానమే సులువుగా ఉంటుంది. ఛార్జీలు కూడా రూ. 2500 ఆ మేర ఉండటం వల్ల ఇది ఏమంత భారంగా కూడా భావించటం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని సీమ ప్రజలు విమానయానమే బెస్ట్ అని భావిస్తున్నారు.

విశాఖపట్నం రూట్‌లో తగ్గిన డిమాండ్

ప్రాంతీయ విమానయానంలో విజయవాడ నుంచి విశాఖపట్నం రూట్‌లో షటిల్ సర్వీసులు ఉండాల్సింది పోయి ఈ మార్గంలో ఒకే ఒక్క విమాన సర్వీసు నడుస్తోంది. విజయవాడ - విశాఖల మధ్యన విమానయానం పెరగకపోవటానికి ప్రధానంగా సమాంతరంగా రోడ్డు, రైలు రవాణా వ్యవస్థలు ఉండటమే కారణం. రోడ్డు మార్గం కంటే కూడా రైలు మార్గం ఈ రెండు ప్రాంతాల ప్రజలకు బడ్జెట్‌గా అందుబాటులో ఉంటోంది. దీంతో విమానయానం పురోగమించటం లేదని తెలుస్తోంది.

స్కిల్‌హబ్ కేంద్రంలో జాబ్‌మేళా రేపు

విజయవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏపీ సీఆర్డీఏ సహకారంతో బుధవారం ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని సీఆర్డీఏ స్కిల్‌హబ్ కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు సీఆర్డీఏ కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు అమరావతి పరిసర ప్రాంతాల్లోనే ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపింది. జాబ్‌మేళాలో ఎంవీఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ లిమిటెడ్, వరుణ్ మోటార్స్, స్కిల్‌క్రాఫ్ట్, కేవీఎం ప్రాజెక్ట్, శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీలు పాల్గొంటాయని సీఆర్డీఏ తెలిపింది. సేఫ్టీ ఆఫీసర్స్, ట్రైనీ ఇంజినీర్లు, సర్వేయర్లు, సర్వీస్&సేల్స్ ఇంజినీర్లు, అసిస్టెంట్ టెక్నీషియన్, ఇంగ్లీష్&సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్లు, మార్కెటింగ్&రికవరీ ఎగ్జిక్యూటివ్, రికవరీ ఆపరేటర్స్ పోస్టులతో పాటు భవన నిర్మాణ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొంది. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, డిగ్రీ, పీజీ చదివిన ఫ్రెషర్స్, అనుభవం ఉన్న అభ్యర్థులు హాజరు కావచ్చని ప్రకటనలో పేర్కొంది. ఎంపికైన అభ్యర్థులకు రూ.12 వేల నుంచి రూ.30 వేల వరకు జీతం ఉంటుందని తెలిపింది. వేతనంతో పాటు ఇన్సెంటివ్, అలవెన్సులు కూడా లభిస్తాయని తెలిపింది. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపింది.

రాష్ట్రస్థాయి డిజైన్ పోటీలు

» ఆప్కో లేపాక్షి సంస్థల ఎండీ విశ్వ మనోహరన్

విజయవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ హస్త, చేనేత కళలకు ఆధునిక రూపమిచ్చే ఉద్దేశంతో ఆప్కో, లేపాక్షి సంస్థలు సంయుక్తంగా రాష్ట్రవ్యాప్త డిజైన్ పోటీలు ఈ నెల 17 నుంచి 30 వరకు నిర్వహిస్తున్నట్టు సంస్థల ఎండీ విశ్వ మనోహరన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ ఈ పోటీలో భాగస్వామిగా ఉందన్నారు. ప్రముఖ హస్తకళలుగా గుర్తింపు పొందిన కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారి ప్రింట్లు, లెదర్ పప్పెట్రీ, వుడ్ కార్వింగ్‌లను ఆహ్వానిస్తున్నట్టు ఆయన తెలిపారు. వీటితో పాటు నేత కళలుగా ప్రసిద్ధి చెందిన ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, బందరులో నూతనంగా రూపొందించిన వస్త్రాలు సూక్ష్మ జ్ఞాపికల విభాగంలో కొత్తదనం ఉట్టిపడేలా కొత్త డిజైన్లను ఆహ్వానిస్తున్నామన్నారు. పోటీల్లో రాష్ట్రానికి చెందిన 18ఏళ్లు పైబడిన కళాకారులు, నేతన్నలు, డిజైనర్లు, విద్యార్థులు పాల్గొనవచ్చని మనోహరన్ తెలిపారు. సృజనాత్మకత, సంప్రదాయ నైపుణ్యం, స్థిరత్వం వంటి ప్రమాణాల ఆధారంగా విజేతలను నిపుణుల కమిటీ ఎంపిక చేస్తుందన్నారు. ప్రతి విభాగంలో మూడేసి బహుమతుల చొప్పున మొత్తం 30 బహుమతులు ప్రకటిస్తున్నట్టు తెలిపారు. మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు.

పాఠశాల స్థలం కబ్జా!

(5వ పేజీ తరువాయి)

కావు. దీనిపై స్థానికులు అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చారు. స్పందించిన అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీన ఈ రెండు ప్రాంతాల్లోని నివాస ప్రాంతాలను 22-ఎలో నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు నెలల క్రితం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదుగా సర్కారుతోట, చిలకలపూడి ప్రాంతాలను 22-ఎ నుంచి తొలగిస్తున్నట్లు రూపొందించిన ఉత్తర్వులను స్థానిక ప్రజలకు అందజేశారు. 22-ఎ నుంచి భూములను తొలగించేందుకుగాను మునిసిపల్, రెవెన్యూ అధికారులు సర్వే చేసిన సమయంలో సర్వే నెంబరు 357, సబ్‌డివిజన్ నెంబరు 20లో పాఠశాల స్థలం 40 సెంట్లు ఉన్నట్లుగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేశారు. పాఠశాల స్థలంపై కన్నేసిన నలుగురు వ్యక్తులు ఈ భూమిని తాము కొనుగోలు చేశామని, తమ పేరున రిజిస్ట్రేషన్‌లు కూడా జరిగాయని చెబుతూ ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. గత నాలుగైదు రోజులుగా ఈ స్థలం సర్వే చేయాలని మునిసిపల్ అధికారులపై స్థానిక పెద్దల ద్వారా తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. అక్రమార్కులకు ఒక మంత్రి పీఏ పూర్తిస్థాయి అండదండలు అందిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. పాఠశాల స్థలానికి సంబంధించిన పూర్తి ఆధారాలను సేకరించిన జనసేన నాయకులు పాఠశాల స్థలం చుట్టూ చేస్తున్న ప్రహరీ నిర్మాణ విషయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వారు చూస్తాం.. చేస్తాం అంటుండటంతో కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

నోటి లెక్కతో సరి..

(5వ పేజీ తరువాయి)

లెక్కకట్టే సౌకర్యం లేకుండా నోటితోనే లెక్కించటం హాస్యాస్పదంగా మారింది. గతంలో ఉన్న వే బ్రిడ్జి పాడైపోయి నిరుపయోగంగా మారింది. దీనిని బాగుచేసి లారీల్లోకి ఎన్ని మెట్రిక్ టన్నుల ఇసుకను లోడింగ్ చేశారో లెక్కకట్టి డబ్బులు వసూలు చేస్తే ఎలాంటి విమర్శలు రావు. కాని వే బ్రిడ్జి లేకుండానే లారీని బట్టి డబ్బులు వసూలు చేయటం స్టాక్‌యార్డునిర్వహణ అధికారులపై ఆరోపణలకు ఆస్కారం కలుగుతోంది.

కార్మికుల వినతి : ఇదిలా ఉండగా తోట్లవల్లూరు ఇసుక కార్మికులు సోమవారం తహసీల్దార్ ఎం కుసుమకుమారిని కలిసి ట్రాక్టర్లతో ఇసుక లోడింగ్ చేసే అవకాశం కల్పించాలని వినతి పత్రం అందించారు. ఇసుక తవ్వకాలు నిలిపివేతతో కార్మికుల జీవనోపాధి దెబ్బతింటోందని వివరించారు.

కొండపల్లి కోట టీడీపీదే..

(5వ పేజీ తరువాయి)

వైస్ ఛైర్మన్లు ఎవరనేది ప్రకటించకుండా 24 గంటలు వాయిదా వేయాలని పట్టుబట్టారు. అయితే, ఇప్పటికే అనేక అభ్యంతరాల మధ్య పదవీకాలం నాలుగేళ్లు పూర్తయిందని, అభ్యంతరాలు ఉంటే కోర్టులోనే తేల్చుకోవాలని, ప్రస్తుతం హైకోర్టు నుంచి వచ్చిన ప్రొసీడింగ్స్‌లో ఉన్నది చదివి ఛైర్మన్ ఎవరనేది ప్రకటించాలని, మళ్లీ ఎన్నిక జరిపే అవకాశం లేదని, 2021లో చేతులెత్తే విధానం ద్వారా ఎంపీ టీడీపీకి వేసిన ఓటు చెల్లుతుంది లేనిది ఇప్పుడు చెప్పలేమని ఆర్డీవో పేర్కొన్నారు. దీంతో వైసీపీ కౌన్సిలర్లు సమావేశపు హాల్ నుంచి వెళ్లిపోయారు.



టీడీపీ అనుబంధ కమిటీల పూర్తికి పరిశీలకుల నియామకం

పెనమలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో టీడీపీ అనుబంధ కమిటీల ఏర్పాటుకు పరిశీలకులను నియమించారు. టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకర రావు, పరిశీలకులు జువ్వాది రాంబాబుల ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో అక్కు రాజా, చిరుమామిళ్ల సూర్యనారాయణ ప్రసాద్, పీతా గోపీచంద్, కొడాలి రామరాజు, ఇలియాస్ పాసా, పుట్టా సురేష్, పల్లపాటి వెంకటసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభాకరరావు, జువ్వాది రాంబాబు

ట్రాఫిక్ వలయంలో ఉయ్యూరు

• బస్‌స్టాపులు, రోడ్లమధ్య నిలుపుతున్న ఆటోలు • పట్టించుకోని పోలీసులు

(ఆంధ్రజ్యోతి - ఉయ్యూరు) : ఉయ్యూరులో రింగ్ సెంటర్‌తో పాటు ప్రధాన రోడ్లలో అనునిత్యం ట్రాఫిక్ సమస్యతలెత్తి రోడ్లపై ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి నడిచే వారికి సైతం ఇబ్బంది కలుగుతోంది. ప్రధానసెంటర్ విజయవాడ బస్‌స్టాప్ వద్ద రోడ్డు మధ్యన మూడు నాలుగు వరుసల్లో ఆటోలు, తోపుడు బళ్లు నిలిపి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నారు. బస్సులు ఆపే ఖాళీలేక ప్రధానసర్కిల్ వద్ద నడిరోడుపై ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో వెనుకవచ్చే వాహనాలు వెళ్లేందుకు వీలు లేక నిలిచి పోతున్నాయి. దీంతో శివాలయం రోడ్డు, బస్ స్టాండ్ రోడ్డు, కాటూరు రోడ్డులో వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నా పట్టించుకునే వారులేరు. సర్కిల్ వద్ద బస్‌స్టాండ్ రోడ్డు, కాటూరు రోడ్డు మలుపు వద్ద ఆటోలు రెండు మూడు వరుసల్లో నిలిపి ప్రయాణికుల కోసం వేచి ఉండటం వలన విజయవాడ వైపు నుంచి వచ్చే బస్సులు, ఇతర వాహనాలు నిలిచిపోతున్నాయి. మార్కెట్ సెంటర్, పాత స్టేట్‌బ్యాంక్ రోడ్డు, బస్‌స్టాండ్ సెంటర్ వద్ద కూడా ఇదే పరిస్థితి. ప్రధాన సెంటర్‌లో ఉదయం, సాయంత్రం పోలీసులు వెళ్లిన తరువాత పట్టించుకున్న వారు లేకపోవడంతో ఆటోల వారికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. రోడ్డు ట్యాక్స్ కడుతున్నాం..మామూళ్లు ఇస్తున్నాం.. ఎక్కడైనా ఆటో ఆపుతామంటూ ఆటో వాళ్లు అంటున్నారని బస్సులు ఎక్కేందుకు వచ్చిన ప్రయాణికులు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం ఒక హోంగార్డు ప్రధాన సెంటర్‌లో కొద్దిసేపు ఉండి వెళ్లిపోవడంతో ట్రాఫిక్ పట్టించుకునే వారు ఉండటం లేదు. బస్‌స్టాండ్ ఇన్‌గేటు ఎదుట రోడ్డు మధ్యలో ఆటోలు నిలపడంతో బస్‌స్టాండ్‌లోకి బస్సులు వెళ్లేందుకు వీలు లేక ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఇప్పటికైన పోలీసులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఉయ్యూరు రింగ్ సెంటర్ వద్ద నిలిచిన ట్రాఫిక్


మార్కెట్ సెంటర్‌లో రోడ్డుపై నిలిపిన ఆటోలతో నిలచిన ట్రాఫిక్

సెల్‌ఫోన్ అపహరణ

హనుమాన్‌జంక్షన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : బస్సు ఎక్కుతుండగా ఫోన్ అపహరణకు గురైన సంఘటన సోమవారం జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగింది. ఆగిరిపల్లి మండల ఉపాధి హామీ పథకం ఏపీవో గా పని చేస్తున్న షేక్ ఖాజావలి ఆగిరిపల్లి వెళ్లేందుకు జంక్షన్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తి జేబు లో ఉన్న విలువైన సెల్‌ఫోన్ అపహరించాడు. బస్సు ఎక్కిన కొద్ది సేపటి తరువాత తన జేబులో సెల్ ఫోన్‌ను ఎవరో అపహరించినట్లు గమనించారు. బాధితుడు జంక్షన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.


పొట్టిపాడు జడ్పీహైస్కూల్‌లో సర్పంచ్ జ్యోతితో కలిసి యూనిఫారం, బుక్స్ అందజేస్తున్న ఎంపీపీ సరోజిని

విద్యా కిట్ల పంపిణీ

ఉంగుటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకుంటూ బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని ఆకాంక్షించారు. పొట్టిపాడు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫారం, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలను సర్పంచ్ కత్తుల జ్యోతితో కలిసి ఆమె పంపిణీ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వపాఠశాలల్లో చేర్పించాలని కోరారు. పాఠశాల హెచ్‌ఎం ఆర్.శివలక్ష్మి, ఉపాధ్యాయులు కృష్ణ, సుధీర్, భార్గవ్, పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


కానూరులో చెత్తను తొలగించిన దృశ్యం

కానూరులో చెత్త తొలగింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కానూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి తాడిగడప మున్సిపల్ అధికారులు స్పందించారు. రోడ్లపై చెత్తకుండీల వద్ద పేరుకుపోయిన చెత్తకుప్పలను పారిశుధ్య సిబ్బంది తొలగించారు. దీంతో కానూరులోని పలు ప్రాంత వాసులు ఊపిరిపీల్చుకున్నారు. తాడిగడప మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో తగినంత మంది పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో పారిశుధ్య నిర్వహణ కొంతమేర ఆలస్యమవుతోందన్నారు. సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఉయ్యూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉయ్యూరు, తోట్లవల్లూరు మండలాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్ తెలిపారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని, అత్యవసర పరిస్థితులు ఉత్పన్నమైతే సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు.

గన్నవరం ఏవోగా శివ ప్రసాద్

గన్నవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ శాఖ అధికారిగా కె.శివప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మొవ్వ నుంచి ఆయన బదిలీపై రాగా, ఇక్కడ పని చేసిన వై.రజని ఇబ్రహీం పట్నం బదిలీ అయ్యారు.

ఉంగుటూరు ఏవోగా రమేష్

ఉంగుటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యవసాయాధికారిగా గద్దె రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏవో గా పనిచేస్తున్న వీవీఎస్‌ఆర్‌ఎస్ హరీష్‌కుమార్ ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం బదిలీ అయ్యారు. రమేష్ దెందులూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని రమేష్ తెలిపారు. అనంతరం మండలంలోని తేలప్రోలు, ఉంగుటూరు రైతుసేవా కేంద్రాలను ఏవో సందర్శించారు. అన్నదాత సుఖీభవ ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించి వీపీఏలకు సూచనలు చేశారు. ఏఈవో బి.దుర్గా నాగేశ్వరరావు, వీపీఏలు షేక్ రసూల్, రమా, రైతులు పాల్గొన్నారు.

బాపులపాడు ఏవోగా రంగనాథ్‌బాబు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు మండల వ్యవసాయ అధికారిగా బి.రంగనాథ్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ రూరల్ మండలంలో నుంచి ఆయన బదిలీపై రాగా, ఇక్కడ పని చేస్తున్న భవాని ఆగిరిపల్లి మండలానికి బదిలీ అయ్యారు. రైతులకు అందుబాటులో ఉంటూ సకాలంలో సేవలందిస్తానన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

• యోగా ప్రముఖ నిపుణుడు శ్రీధారణ

గన్నవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని యోగా నిపుణులు తోటకూర శ్రీధారణ(బీహార్) అన్నారు. చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో సోమవారం యోగా శిక్షణ కార్యక్రమం జరిగింది. శ్రీధారణ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి దైనందిన జీవితంలో యోగా భాగం కావాలన్నారు. వేకువజామున లేచి యోగా చేసే వారే సంపూర్ణ ఆరోగ్యవంతులన్నారు. యోగా సాధనతో ఉన్నత వ్యక్తిత్వం, ఉత్తమ జీవన విధానం అలవడు తుందన్నారు. యోగా సాధకుల జీవితాలు ప్రపంచానికి ఆదర్శ గ్రంథాలుగా నిలిచాయన్నారు. ప్రపంచానికి యోగాను అందించింది భారతదేశమేనన్నారు. శాస్త్రీయ పరిశోధనలు సైతం యోగాను సమర్థించాయన్నారు. ప్రతి ఒక్కరు యోగా సాధకుడై కుటుంబాన్ని, సమాజాన్ని పరిపూర్ణ ఆరోగ్యంతో నింపాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.భీమేశ్వర్, మెడికల్ కళాశాల ఏవో టీవీ సుబ్బారావు, గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ జి.సజన, డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.


యోగాసనాలు చేయిస్తున్న బీహార్ యోగా శిక్షణ నిపుణుడు శ్రీధారణ

రైతులకు సకాలంలో సాగు నీరు

• ఎమ్మెల్యే బోడె వెంకట్ రామ్

కంకిపాడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సకాలంలో సాగునీరందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు బోడె వెంకట్ రామ్ అన్నారు. కంకిపాడు కాల్వ వద్ద తూర్పుకృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవరబోయిన వెంకటేశ్వరరావుతో కలిసి సాగునీటిని విడుదల చేశారు. వెంకట్ రామ్ మాట్లాడుతూ కూటమి రైతులకు అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటల్లోనే నగదు రైతుల ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. ఈఈ ఆర్ రవి కిరణ్, డీఈఈ అపర్ణ, ఏఈఈ పి. నాగబాబు, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, డీసీ చైర్మన్ దేవినేని రత్నభూషన్, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడుసుదిమళ్ల రవీంద్ర, పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, ఏనుగ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


కంకిపాడు లాకుల వద్ద నుంచి రైతులకు సాగు నీరు విడుదల చేస్తున్న బోడె వెంకట్ రామ్, తదితరులు

క్రమశిక్షణాయుత విద్య అవశ్యం

• వీసీ ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు



వీఆర్ సిద్ధార్థలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న యాజమాన్యం

పెనమలూరు, జూన్16 (ఆంధ్రజ్యోతి) : కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఫ్రెషర్స్ కు పునశ్చరణ తరగతులు నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఆత్మనిర్భర్ భారత్ సాధనలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. వ్యక్తిత్వం, క్రమశిక్షణ, నూతన ఆవిష్కరణలు విద్యార్థుల ప్రధానమైనవన్నారు. ప్రొఫెసర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ సిద్ధార్థ విశ్వవిద్యాలయ విజన్, మిషన్ వివరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవి చంద్ విద్యలో క్రమశిక్షణ ప్రాముఖ్యతను వివరించారు. లాంగ్వేజి, కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యమని తెలిపారు. డీన్ ప్రొఫెసర్ డి. వెంకటరావు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యానవన అధికారిగా జోసఫ్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండల ఉద్యాన వనశాఖ అధికారిగా చందు జోసఫ్ సుందరం సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న హరిశ్చంద్ కంకిపాడు బదిలీ కాగా కంకిపాడు మండలానికి చెందిన జోసఫ్ సుందరం బాపులపాడు బదిలీపై వచ్చారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

అధ్యాపకులు అప్‌గ్రేడ్ కావాలి

• జేఎన్‌టీయూకే వీసీ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్

పెనమలూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూ కాకినాడ, వాధ్వానీ ఫౌండేషన్, పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఐదు రోజుల ట్రైన్ ది ట్రైనర్స్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథి జేఎన్‌టీయూకే వీసీ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ, నాణ్యమైన విద్య ప్రాముఖ్యతను ఉద్ఘాటించారు. అధ్యాపకులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తమను అప్‌గ్రేడ్ చేసుకొని విద్యార్థులను పరిశ్రమకు దగ్గరగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రిన్సిపాల్ కె.శివాజీబాబు మాట్లాడుతూ అధ్యాపకులకు నిరంతర అభ్యాసం అవసరమన్నారు. ఏపీలోని వివిధ కళాశాలల నుండి 129 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ బాలకృష్ణ, వాధ్వానీ ఫౌండేషన్ డైరెక్టర్ దయాకర్ మూర్తి, గూగుల్ ఏఐ ఇంజనీర్ సఫియుద్దీన్ ఖాజా, డాక్టర్ ఎ అరుణ, డాక్టర్ సూర్యప్రసాదరావు, డాక్టర్ జానకి రామయ్య, డాక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.


పీవీపీ సిద్ధార్థ కళాశాలలో అధ్యాపకుల శిక్షణ కార్యక్రమంలో యాజమాన్యం, అధ్యాపకులు

పచ్చరొట్ట ఎరువులతో భూసారం పెంపు

• ఏడీఏ ఎం.సునీల్


బుద్ధవరంలో జీలుగను పరిశీలిస్తున్న ఏడీఏ ఎం.సునీల్

గన్నవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : భూసారాన్ని పెంచుకునేందుకు పచ్చిరొట్ట ఎరువు దోహదపడుతుందని ఏడీఏ ఎం.సునీల్ అన్నారు. బుద్ధవరంలో జీలుగ చేనును సోమవారం ఆయన సందర్శించారు. రైతులు రసాయనిక ఎరువులను ఎక్కువగా వినియోగిస్తే భూసారం దెబ్బతిని పంటల నాణ్యత తగ్గుతుందన్నారు. నాణ్యమైన పంటలను ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేస్తోందన్నారు. జీలుగ సాగు చేసి దున్నితే మంచి దిగుబడితో పాటు నాణ్యమైన పంట వస్తుందన్నారు. రైతులు రసాయన ఎరువులను తగ్గించి పచ్చి రొట్ట ఎరువులను వాడుకోవాలని సూచించారు. వీపీఏ సాగర్, ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

కాల్వలు, డ్రెయిన్లకు సకాలంలో మరమ్మతులు పూర్తి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు కాల్వకు అనుసంధానంగా ఉన్న డ్రెయిన్లలో పూడికతీత చేపట్టి, గండ్లు పూడ్చి వేసి సకాలంలో రైతులకు సాగునీరందిస్తామని డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ తెలిపారు. ఓగిరాలలోని సుందరయ్య కాలువలో పూడికతీత, గండ్లు పూడ్చివేత పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు డ్రెయిన్లు, సాగునీటి కాల్వల పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన పూర్తయ్యేలా చేపట్టినట్లు వివరించారు. సుమారు రూ.7లక్షల వ్యయంతో సుందరయ్య కాలువ పూడికతీత, గండ్లు పూడ్చివేత పనులు, కానుమోలు- ఆరుగొలను మైనర్ డ్రెయిన్ పనులను మొదలుపెట్టినట్లు డీసీ చైర్మన్ రాజేష్ వివరించారు. ఏలూరు కాలువకు సాగునీటి విడుదలయ్యే సమయానికి ప్రధాన కాలువలో గుర్రపుడెక్క తొలగించడంతో పాటు వివిధ కాలువల మరమ్మతులు, పూడికతీత పనులను పూర్తిచేస్తామన్నారు.



సుందరయ్య కాలువ పూడికతీత, గండ్లు పూడ్చివేత పనులను ప్రారంభిస్తున్న డీసీ చైర్మన్ రాజేష్, రైతులు

కేబుళ్లతో కళా విహీనం

- నగర సౌందర్యానికి విఘాతం
- వాహన, పాదచారులకు ఇబ్బందే





రాష్ట్రానికి రాజధాని నగరంగా పేరుతెచ్చుకున్న విజయవాడకు రోజూ లక్షలాది మంది వచ్చిపోతుంటారు. దీంతో నగరంలో కళకళలాడుతుంటుంది. అయితే, నగర సౌందర్యానికి, భద్రతకు ముప్పు తెచ్చేలా కేబుల్ వైర్లు మారుతున్నాయి. బెంజ్ సర్కిల్, నిర్మల కాన్వెంట్, రమేశ్ హాస్పిటల్, గవర్నమెంట్ హాస్పిటల్, రామవరప్పాడు సిగ్నల్స్ వంటి కీలక ట్రాఫిక్ పాయింట్ల వద్ద సిగ్నల్ పోల్స్ చుట్టుకుని చిక్కుముడుల్లా, అస్తవ్యస్తంగా వేలాడుతున్న కేబుల్ వైర్లు నగరవాసులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఇవి ఎప్పుడైనా తెగిపడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా రానున్న వర్షాకాలంలో విద్యుత్ షాక్ లేదా షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలకు దారితీయొచ్చు. ఈ వైర్లు సిగ్నల్ పోల్స్‌ను చుట్టుకుని సిగ్నల్స్ సరిగా కనిపించనీయకుండా చేసి, వాహనదారుల దృష్టిని మళ్లించి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. తక్కువ ఎత్తులో వేలాడుతూ పాదచారులకు, ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధులకు ఆటంకంగా మారి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. నగర సౌందర్యాన్ని సైతం దెబ్బతీస్తోంది. విజయవాడ వంటి పర్యాటక, వ్యాపార కేంద్రంగా ప్రసిద్ధి చెందిన నగరంలో ఈ అస్తవ్యస్త వైర్లు నగర ఇమేజీను దిగజారుస్తున్నాయి. వీటిపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి. భూగర్భ కేబుల్ వ్యవస్థను అమలు చేయడం, వైర్లను క్రమబద్ధీకరించడం వంటి పరిష్కారాలు నగర భద్రత, సౌకర్యం, సౌందర్యాన్ని పెంచడమే కాక, ప్రమాదాలను నివారిస్తాయి. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీ రాజశేఖరబాబు

మహిళా పీఎస్‌కు కొత్త కళ

- ఆధునికీకరించిన భవనం ప్రారంభం

విజయవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పీసీఆర్ జంక్షన్‌లోని మహిళా పోలీస్‌స్టేషన్‌కు కొత్తదనం వచ్చి చేరింది. ఈ పోలీస్ స్టేషన్ భవనాన్ని ఆధునికీకరించి అందుబాటులోకి తీసుకొచ్చారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు సోమవారం దీన్ని ప్రారంభించారు. ఇందులో కొత్తగా చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్ ప్లే రూమ్‌లను ఏర్పాటు చేశారు. పోక్సో కేసుల్లో స్టేషన్‌కు వచ్చే బాధితులను విచారించడానికి ఈ కార్నర్‌ను కొత్తగా ఏర్పాటు చేశారు. అలాగే ఏసీపీ, మహిళా సిబ్బందికి ప్రత్యేకంగా విశ్రాంతి చాంబర్లను ఏర్పాటు చేశారు. అధికారులకు చాంబర్లు, కోర్టు రూం, రిసెప్షన్, మహిళా హెల్ప్‌డెస్క్, కౌన్సెలింగ్ సెంటర్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగాలకు వేర్వేరు చాంబర్లు నిర్మించారు. డీసీపీలు కేజీవీ సరిత, తిరుమలేశ్వర రెడ్డి, ఉదయరాణి, కృష్ణమూర్తి నాయుడు, ఎస్వీడీ ప్రసాద్, ఏడీసీపీలు ప్రసన్న కుమార్, ఏసీపీలు లతాకుమారి, స్రవంతిరాయ్, పావన్ కుమార్ పాల్గొన్నారు.

సొంత మండలాల్లో బదిలీలు కల్పించాలి

- గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జానీ పాషా

విజయవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సొంత మండలాల పరిధిలో బదిలీలు కల్పించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సచివాలయ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి వినతిపత్రం అందజేశారు. సోమవారం మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో గ్రామవార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీ పాషా మాట్లాడుతూ విధుల్లో చేరినప్పటి నుంచి న్యాయంగా రావాల్సిన రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు వెంటనే మంజూరు చేయాలని కోరారు. సచివాలయంలో మంత్రి అందుబాటులో లేకపోవడంతో మంత్రి కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశామని, మంత్రి దృష్టికి వెంటనే తీసుకెళ్లాలని మంత్రి కార్యాలయ అధికారులను కోరామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మ ఉన్నారు.

కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



హనుమాన్‌జంక్షన్ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎన్ పాలెం వద్ద హనుమాన్‌జంక్షన్ బైపాస్‌పై (జాతీయ రహదారి) రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీ కొనడంతో అక్కడిక్కడే మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. రహదారి పక్కనున్న హోటల్ (డాబా) వైపు నుంచి వెళుతూ రోడ్డు దాటే క్రమంలో ఏలూరు నుంచి విజయవాడ వైపునకు వేగంగా వస్తున్న కారు ఢీ కొట్టడం వల్ల వ్యక్తి రోడ్డు పక్కకు పడిపోయి అక్కడిక్కడే మృతి చెందాడు. రాత్రి పూట కావడం, రహదారిపై లైట్లు లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వ్యక్తి ఆచూకీ కోసం ఘటనా స్థలానికి పక్కనే ఉన్న ఎస్ఎన్ పాలెం, కే సీతారాంపురం గ్రామాలతో పాటు హోటళ్లలోనూ వాకబు చేశామని, కానీ ఎవరనేది తెలియలేదని ఎస్సై సురేష్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు హనుమాన్ జంక్షన్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

నాగాయలంకలో నేడు జలయోగా ప్రదర్శన

నదిపై తేలియాడుతూ యోగాసనాలు వేస్తూ శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు ● యోగా డేను పురస్కరించుకుని శ్రీరామపాదక్షేత్రంలో ఏర్పాట్లు

అవనిగడ్డ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర ప్రదేశ్ మురిసేలా యావత్ దేశం కృష్ణాజిల్లా వైపు తలతిప్పి చూసేలా ముందెన్నడూ జరగని రీతిలో నాగాయలంక వద్ద కృష్ణానదిలో యోగా డే నిర్వహించేందుకు జిల్లా అధికారులు సమాయత్తమవుతున్నారు. సాధారణంగా నేలపై యోగాసనాలు సాధన



ఆసనాలు వేస్తున్న అభ్యాసకులు

చేయటం సర్వసాధారణం. కాగా అటుపోట్లను, అలల తాకిడిని అధిగమిస్తూ నీటిపై తేలియాడుతూ వందల సంఖ్యలో అభ్యాసకులతో నాగాయలంకలో







నదిలో తేలుతూ ఆసనాలు వేస్తున్న జలయోగా అభ్యాసకులు, శిక్షణ పొందుతున్న చిన్నారులు, మత్స్యకారులు

ప్రదర్శన ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికారులు ఏర్పాటు చేస్తుండగా, గత మూడు రోజులుగా నదిపై తేలియాడుతూ యోగాను అభ్యసిస్తున్న వారితో శ్రీరామపాదక్షేత్రం కళకళలాడుతోంది.

రాష్ట్రంలో తొలిసారిగా దివిసీమలో..

యోగా డేను పురస్కరించుకుని నదిలో యోగాసనాలు వేయించాలన్న తలంపుతో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చొరవ చూపటంతో ఈ జలయోగాకు అధికారులు శ్రీకారం చుట్టారు. నదిపై తేలుతూ శవాసనం, వృక్షాసనం, పద్మాసనం, ధనురాసనాలు వేసే అభ్యాసకులు స్థానికంగా ఉన్న విషయాన్ని గుర్తించిన అధికారుల బృందం వారిని ప్రోత్సహించటంతోపాటు ఈ కళను నేటి తరానికి అందించాలన్న సదుద్దేశంతో ఈ జలయోగాకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే కృష్ణానదిలో నిత్యం ఈత అభ్యసించే పలువురు ఈ ఆసనాలను క్రమం తప్పకుండా వేస్తుండటంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో ఈతవచ్చిన వారిని శ్రీరామపాదక్షేత్రానికి రప్పించి బుధవారం మధ్యాహ్నం భారీ జలయోగా ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు.

విద్యార్థులకు, మత్స్యకారులకు శిక్షణ

జలయోగాకు పెద్ద సంఖ్యలో ఔత్సాహికులు పాల్గొనేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శాప్ నుంచి నలుగురు స్విమ్మర్లు, ఆయూష్ శాఖ నుంచి ముగ్గురు యోగా శిక్షకులు, నలుగురు మెడికల్ ఆఫీసర్లు ఈ శిక్షణలో పాలు పంచుకుంటుండగా, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో యువత గత మూడు రోజులుగా ఉదయం, సాయంత్రం శిక్షణ పొందుతున్నారు.

అబ్బుర పరిచేలా జలయోగా: తహసీల్దార్



దేశం అంతా అబ్బురపడేలా జలయోగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు చేశామని, తహసీల్దార్ ఎం హరనాథ్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య నదిలో 300 మందితో ఈ యోగా ప్రదర్శన జరుగుతుందన్నారు. ఇందులో పాల్గొనే వారికి కలెక్టర్, ఎమ్మెల్యే చేతులమీదుగా జలయోగా సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేయనున్నామన్నారు.

విఘ్నాలు రాకుండా మహాగణపతి రక్షించాలి

- ఎంపీ కేశినేని శివనాథ్ తనయుడు వెంకట్
- నటుడు సుమన్‌తో కలిసి మట్టి వినాయక విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



మహా మట్టి గణపతి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న వెంకట్, సుమన్

విద్యాధరపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అయిన రాజధాని అమరావతి నిర్మాణానికి, రాష్ట్రాభివృద్ధికి ఎలాంటి విఘ్నాలు రాకుండా ఆ విఘ్నాధిపతి కాపాడాలని, రాష్ట్ర ప్రజలందరిపై ఆ మహాగణపతి ఆశీస్సులుండాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తనయుడు కేశినేని వెంకట్ కోరారు. డూండీ గణేష్ సేవాసమితి ఆధ్వర్యంలో విద్యాధరపురం సితార సెంటర్ సమీపంలోని లేబర్ కాలనీ గ్రౌండ్‌లో 72 అడుగుల మహా మట్టి గణపతి విగ్రహ ఏర్పాటుకు సోమవారం భూమి పూజ జరిగింది. కేశినేని వెంకట్, సీనియర్ సినీ నటుడు సుమన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరికి డూండీ గణేష్ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డూండీ రాకేష్‌తో పాటు కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు. అనంతరం 72 అడుగుల మహా మట్టి గణపతి విగ్రహ ఏర్పాటుకు కేశినేని వెంకట్, సినీ నటుడు సుమన్ పూజ చేసి కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేయటంతో పాటు షెడ్డు నిర్మాణానికి కర్ర పూజ చేశారు. ఈ సందర్భంగా కేశినేని వెంకట్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ లేని విధంగా 72 అడుగుల మహా మట్టి గణపతి విగ్రహం రాజధాని ప్రాంతంలో ఏర్పాటు చేయటం ప్రజలందరి అదృష్టమన్నారు. అనంతరం సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ ఖైరతాబాద్ వినాయక విగ్రహాన్ని మించిన ఎత్తులో మట్టితో వినాయక విగ్రహం తయారు చేయటం చాలా గొప్ప విషయమన్నారు. ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, డూండీ గణేష్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డూండీ రాకేష్ మాట్లాడుతూ అమరావతి నిర్మాణం త్వరగా పూర్తి కావాలని, అభివృద్ధి ఫలాలు ప్రజలందరూ అందుకోవాలనే ఆకాంక్షతో మహా మట్టి గణపతి విగ్రహానికి భూమిపూజ చేయటం సంతోషంగా ఉందన్నారు. కమిటీ సభ్యులు గడ్డం రవి, పేర్ల రవి, ముక్తేశ్వరరావు, డీ సుబ్బారావు, చైతన్య నాగేశ్వరరావు, శ్రీనివాస్, సత్యనారాయణ, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, డివిజన్ అధ్యక్షుడు శివశర్మ, పేరం సత్యనారాయణ, టీడీపీ సీనియర్ నేత రేగళ్ల లక్ష్మణరావుతో పాటు టీడీపీ కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ భూసర్వే తప్పిదం

తల్లికి వందనం పథకానికి అనర్హత

- ఓగిరాలలో వెలుగుచూసిన ఘటన ● 20 మందికి పైగా అందని తల్లికి వందనం
- ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశాలతో సరిచేస్తున్న అధికారులు



ఓగిరాలలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్ మురళీకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ కొమ్మారెడ్డి రాజేష్

హనుమాన్‌జంక్షన్ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం భూసర్వేలో చేసిన తప్పిదానికి ఓగిరాలకు చెందిన 22 బీసీ కుటుంబాలకు తల్లికి వందనం పథకానికి అనర్హులయ్యారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి సమస్యను తీసుకువెళ్లడంతో ఈ ఘటన సోమవారం వెలుగుచూసింది. ఓగిరాలలోని రామచంద్రయ్య లంక సగరుల చేపల చెరువు గత ప్రభుత్వం నిర్వహించిన భూసర్వేలో బీసీలకు చెందిన 51 మంది పేరుతో ఒక్కొక్కరికీ 33 ఎకరాలున్నట్లు తప్పుగా ఆన్‌లైన్‌లో నమోదైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ఈ 51 మంది ఎకరంలోపు భూమి ఉన్నవారే కావడం, హద్దులు తెలియక మొత్తం భూమి అందరిపేరుతో జాయింట్ ఎల్పీగా ఆన్‌లైన్‌లో నమోదవడం గమనార్హం. అందులో సుమారు 20 మందికి తల్లికి వందనం పథకం ప్రకారం నగదు జమ కాకపోవడంతో లబ్ధిదారులు 4 రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గ్రామంలోని అధికారులు సరైన సమాధానం చెప్పక పోవడంతో ఎమ్మెల్యే యార్లగడ్డను ఆశ్రయించారు. ఆయన ఆదేశాలతో తహసీల్దార్ మురళీకృష్ణ, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ కొమ్మారెడ్డి రాజేష్ గ్రామంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. భారీగా తరలివచ్చిన మహిళలు తమకు లేని భూమిని తమ పేరుతో నమోదు చేయడం వల్ల తల్లికి వందనం పథకానికి అనర్హులుగా తేల్చారని, పిల్లల చదువుకు ఆటంకం కలగకుండా త్వరగా సరిచేయాలని కోరారు. తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంఈవో రాంబాలాసింగ్, ఇతర అధికారులతో ఫోన్‌లో సంప్రదించారు. లబ్ధిదారుల పేర్లు, వారి వద్ద గల ఆర్‌వోఆర్‌ఆధారంగా భూవివరాలను విద్యాశాఖకు అందజేసి త్వరలోనే అర్హులైన వారందరికీ తల్లికి వందనం పథకం అందేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మురళీకృష్ణ హామీ ఇచ్చారు.

కళాత్మక యోగాతో మరింత చైతన్యం

- సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ సిరి

ఇబ్రహీంపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కళాత్మకమైన యోగాసనాలు, వాటిపై వివిన్న పోటీలు నిర్వహించి నైపుణ్యవంతమైన కళాకారులతో విస్తృత ప్రాచుర్యం కల్పిస్తున్నామని రాష్ట్రంలో 2.20 కోట్ల మంది యోగాసనాలను ఆచరించాలనే లక్ష్యంతో యోగాంధ్రకు రూపకల్పన చేసినట్టు సెంకడరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఏ సిరి చెప్పారు. గుంటుపల్లి డాన్‌బోస్కో స్కూల్లో మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి యోగాసనాల పోటీల్లో పాల్గొనే టీమ్‌ను జిల్లా



రాష్ట్ర స్థాయి యోగాకు ఎంపికైన వారితో ఉన్నతాధికారులు

స్థాయి విజేతలను ఎంపిక చేసే ప్రక్రియ మూడు రోజులపాటు జరగనుంది. సోమవారం ఈ పోటీలను ఆమె, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా నృత్యం, యోగా చిత్రలేఖనం, యోగా ఫొటోగ్రఫీ, యోగా స్లోగన్ వంటి అంశాలపై జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించామన్నారు. కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో 10 లక్షల మందికి యోగా శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంగా నిర్వహించుకున్నామన్నారు. డీఆర్‌డీఏ పీడీ నాంచారయ్య, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారి డాక్టర్ వీ రాణి, ఆయుష్ అధికారి డాక్టర్ రామత్లేహిలు పాల్గొన్నారు.

యోగాసనాల పట్ల యువతలో చైతన్యం రావాలి: కలెక్టర్

సత్యనారాయణపురం: యువత నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు నిరంతర యోగా దోహదపడుతుందని, శారీరక, మానసిక ఉల్లాసానికి యోగాసనాలు ఏకైక మార్గమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర మహోత్సవాల్లో భాగంగా బీఆర్‌టీఎస్ రోడ్డులో సోమవారం జిల్లా అధికారులు, వీఎంసీ ఆధ్వర్యంలో జరిగిన యోగాంధ్రలో రెడ్ క్రాస్ సభ్యులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ జీ సమరం మాట్లాడుతూ రోజులో కొంత సమయం యోగాకు కేటాయించాలన్నారు. వైస్ చైర్మన్ వెలగా జోషి, ఎన్‌సీసీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కే రమేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, యోగా ట్రైనర్లు సత్యనారాయణ, యుగంధర్, యూడ్ రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ విమానాశ్రయం ఎదురుగా

భారీ కన్వెన్షన్ సెంటర్..!

- రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రతిపాదనలు
- నిధులు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి



ఆంధ్రజ్యోతి, విజయవాడ: బెజవాడ అంతర్జాతీయ విమానాశ్రయం ఎదురుగా భారీ కన్వెన్షన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన వెళ్లింది. కృష్ణాజిల్లాలోనే అతి పెద్ద కన్వెన్షన్ సెంటర్ దిశగా అడుగులు పడుతున్నాయి. విమానాశ్రయం ఎదురుగా ప్రభుత్వానికి సంబంధించి 12.50 ఎకరాల స్థలం ఉంది. ఎంతో విలువైన ఈ స్థలంలో కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నిర్ణయించారు. అధికారులతో చర్చించి భారీ కన్వెన్షన్ సెంటర్‌కు ప్రతిపాదించారు. ఇటీవల నిర్వహించిన నియోజకవర్గ మినీ మహానాడులోనూ తీర్మానించారు. తర్వాత ఎమ్మెల్యే యార్లగడ్డ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. ఈ కన్వెన్షన్ సెంటర్ అవసరాన్ని వివరించారు. ఇందుకు అవసరమైన నిధులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దాదాపుగా 3 నుంచి 5 వేల సామర్థ్యంతో కూడిన విధంగా కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలన్నది ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇదే ప్రాంతంలో కమర్షియల్‌గానూ కార్యకలాపాలను పెంచేందుకు సమాంతరంగా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎంతో మంది ప్రముఖులు వస్తుంటారు. రాజధాని అమరావతి నిర్మాణ పనుల నేపథ్యంలో, విమానాశ్రయాల్లోనే గతంలో మీటింగ్స్ జరిగిన ఉదంతాలున్నాయి. ప్రస్తుతం అప్పటి కంటే 10 రెట్లకు పైగా రాజధానిలో పనులు జరుగుతున్నాయి. ఇలాంటపుడు రానున్న రోజుల్లో సమావేశాలకు వేదిక అవసరం ఉంటుంది. అందుకే విమానాశ్రయానికి అభిముఖంగా కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయగలిగితే ఆ కొరత తీరుతుంది. ప్రైవేటు సమావేశాలకు బదులు ఈ నూతన సెంటర్‌కు అనుమతులిస్తే దీర్ఘకాలంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఖర్చు ఆదా అవుతుంది. ప్రజలకు కూడా అద్భుతమైన కన్వెన్షన్ సెంటర్ అందుబాటులో ఉంటుంది.

'మాదక' మహమ్మారిపై దాడిచేద్దాం

- అన్ని విద్యాసంస్థల్లోనూ ఈగల్ క్లబ్స్ ఉండాలి: కలెక్టర్ లక్ష్మీశ



మాదక ద్రవ్యాల నిరోధక పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సుసంపన్న, ఆరోగ్య, ఆనంద ఆంధ్ర సాకారం దిశగా అడుగులేస్తూ మూకుమ్మడి దాడితో మాదక ద్రవ్యాల మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టేందుకు చేయి చేయీ కలుపుదామని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్ సమన్వయం, నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ, కౌన్సెలింగ్ సేవలు తదితరాలపై సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలని, ఇందుకు ఈగల్ క్లబ్స్‌తో పాటు క్యాంపస్ అంబాసిడర్లను నియమించాలని ఆదేశించారు. యోగాంధ్ర మాసోత్సవాలు ముగిసిన తరువాత నెలరోజుల పాటు మాదక ద్రవ్యాలపై పోరాటానికి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమన్వయ శాఖలు, ఎన్జీవోలు, డీఎల్ఎస్ఏ నిపుణుల భాగస్వామ్యంతో ర్యాలీలు, వాక్‌థాన్‌లు, సదస్సులు నిర్వహించనున్నామన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు, ఈగల్ బృందాలు తీసుకొంటున్న చర్యలను డీసీపీ కేజీవీ సరిత వివరించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 73 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేసి 175 మందిని అరెస్టు చేసినట్టు వివరించారు. 1,054 కిలోల గంజాయిని సీజ్ చేసినట్టు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ, సమన్వయ శాఖల అధికారులతో కలిసి డ్రగ్స్ వద్దు.. స్కిల్స్ ముద్దు, ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా వివిన్న ప్రతిబావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ అధికారి వాడ్రేవు కామరాజు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏసీపీ కే వెంకటేశ్వరరావు, డీ అడిక్షన్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, ఈగల్ ఎస్ఐ ఎం వీరాంజనేయులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	102, 110, 121
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

ఎన్నికల పరిశీలకుల నియామకం


శాయిన పుష్పావతి


కొడాలి రామరాజు

గుడ్లవల్లేరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సంస్థాగత మండల స్థాయి ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ స్థాయి, మండల స్థాయిలో పరిశీలకులుగా రాష్ట్ర పార్టీ నియమించింది. కాగా గుడ్లవల్లేరు మండలం నుంచి ఇరువురు అబ్జర్వర్లుగా రాష్ట్రపార్టీ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాపరిషత్ మాజీవైస్‌ఛైర్మన్ రాష్ట్ర పార్టీ కార్యదర్శి అయిన శాయిన పుష్పావతిని పామర్రు నియోజకవర్గం పరిశీలకురాలుగా నియమించారు. అలానే రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొడాలి రామరాజును పెనమలూరు నియోజకవర్గం పరిశీలకుడిగా అధిష్ఠానం నియమించింది.


రైతులకు ఈకేవైసీ నమోదు చేస్తున్న అనంతలక్ష్మి

అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ తప్పనిసరి

గుడివాడ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి రైతులందరూ ఈకేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏవో బి.అనంతలక్ష్మీ పేర్కొన్నారు. సోమవారం ఆమె ఆర్ఎస్‌కే సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి రైతుల నుంచి వేలిముద్రలను అన్ని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేస్తున్నామన్నారు. ఆర్ఎస్‌కేల్లో ఎంత పర్సంటేజీ చేస్తున్నారో తదితర వివరాలు ఆర్ఎస్‌కె సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 20వ తేదీలోగా మండలం మొత్తం రైతులందరికీ వేలిముద్రలు పూర్తి చేయాలని కోరారు. ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వృద్ధులకు భోజన వసతి

గుడివాడ : స్థానిక కర్ల వృద్ధాశ్రమంలో సోమవారం కట్టా నాగేశ్వరరావు 5వవర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబసభ్యులు కట్టా శ్రీనివాసరావు, సురేష్‌బాబు, పోమ దుర్గల సహకారంతో వృద్ధులకు భోజనవసతి కల్పించారు. నూతన వస్త్రాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.హరికుమార్, సభ్యులు తిరుపతయ్య, సురేంద్రబాబు, మునీంద్ర, తాతారావు, వెంకటేశ్వరరావు, హరిబాబు, వృద్ధాశ్రమం నిర్వాహకులు కర్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంపై జాగ్రత్తలు తప్పనిసరి

● డీఎస్పీ ధీరజ్ వినీల్

నందివాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆక్వా చేపల రైతులు, చెరువుకట్టలపై విద్యుత్ వైర్లు చెరువు చుట్టూ తిప్పి మోటార్లు ఆడించేందుకు ఇష్టానుసారంగా వేయటంతో రాత్రిళ్లు కాపలాదారులు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోతున్నారని జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. నందివాడ కొండపల్లి కన్వెన్షన్ హాలులో ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు విద్యుత్ శాఖ అధికారులతో సోమవారం విద్యుత్ పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపల రైతులు విద్యుత్ లైన్లు , ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకునేటప్పుడు ఐరన్ బోర్డులు వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కరెంట్ మీటర్లకు బోర్డులకు చెక్క బోర్డులు ఉపయోగించాలన్నారు. విద్యుత్ షాక్‌తో నోరు లేని మూగజీవాలు, గేదెలు కరెంట్ షాక్‌లతో చనిపోవటం బాధాకరమన్నారు. అదేవిధంగా చెరువుల మీద కాపలాదారులకు ఐరన్ రేకులతో షెడ్లు ఏర్పాటు చేయటం, వాటి పక్కనే అనుకుని కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, మీటరు బోర్డులు ఏర్పాటు చేయటం దారుణమన్నారు. చెరువు చుట్టూ నాసి రకం వైర్లు వేయటం వల్ల వైర్లు ఇన్సులేషన్స్ ఊడిపోవటంతో ఎక్కువ శాతం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వివరించారు. చెరువుపై కాపలాదారులు బ్రతుకు తెరువు కోసం కాపలాదారుడుగా పని చేస్తుంటే విద్యుత్ షాకుల వల్ల చనిపోవటంతో వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి అని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ప్రతీ ఒక్కరూ చేపల చెరువుల యజమానులు విద్యుత్‌పై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ ఏడీ కృష్ణ మాణిక్య వర్మ , ఫైర్ శాఖ అధికారులు, రూరల్ సీఐ సోమేశ్వరరావు, ఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది, ఆక్వా రైతులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

పెదపూడి యూపీ పాఠశాల హైస్కూల్‌గా అప్‌గ్రేడ్

కూచిపూడి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మొవ్వలోని యూపీ పాఠశాల ఈ విద్యాసంవత్సరం నుంచి హైస్కూల్‌గా రూపాంతరం చెందింది. గత విద్యాసంవత్సరం వరకు 1 నుంచి 8వ తరగతి వరకు కొనసాగిన ఈ పాఠశాల ఈ ఏడాది 9వ తరగతి వరకు ప్రారంభమైంది. ఈ పాఠశాల విద్యార్థుల సంఖ్య 145కు చేరటంతో పాటు 11 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. అప్‌గ్రేడ్ అయిన పాఠశాలను గ్రామ సర్పంచ్ తాతా రజని సోమవారం పరిశీలించి విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల అప్‌గ్రేడ్ అవడానికి కృషి చేసిన వర్ల కుమార్ రాజా తోపాటు జిల్లా విద్యాశాఖాధికారులకు పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.


అప్‌గ్రేడ్ అయిన పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపును నిలిపి వేయాలి

● సమన్వయ కమిటీ నాయకురాలు అరుణ

గుడివాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రజలు వ్యతిరేకిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా బిగిస్తోందని సమన్వయ కమిటీ నాయకురాలు బసవ అరుణ ఆరోపించారు. స్మార్ట్‌మీటర్‌ల బలవంతపు బిగింపును వ్యతిరేకిస్తూ విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయాన్ని ప్రజాసంఘాలు, పలు కాలనీల అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో సోమవారం ముట్టడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్న అధికారులు మాత్రం వేగంగా మీటర్లను ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. జూలై 9వ తేదీ దేశవ్యాప్త ఉద్యోగ, కార్మిక సంఘాల సమ్మె సందర్భంగా అదే రోజున స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఆపాలని కోరుతూ గుడివాడ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. స్మార్ట్‌మీటర్ల బిగింపును ఆపాలని విద్యుత్ శాఖ ఏడీఈకి వినతిప్రతం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల అభివృద్ధి కమిటీ సభ్యులు నూరున్నీసా, నాగవాణి, మూడెడ్ల ఉమా, బొత్స లక్ష్మీ, బి.వి రమణ, ఉత్తర లక్ష్మీ, ప్రజాసంఘాల నాయకులు శ్రీనివాసరావు, అవిర్నేని వెంకటేశ్వరరావు, శివరాంప్రసాద్, ప్యారీ, అప్పల నాయుడు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నేతలు

ఆటోనగర్ సమస్యలను పరిష్కరించండి

● తమ్మిశెట్టి లక్ష్మణరావు

గుడివాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఆటోనగర్‌లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని ది గుడివాడ ఇండస్ట్రీయల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు తమ్మిశెట్టి లక్ష్మణరావు కోరారు. సోమవారం మచిలీపట్నంలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డి.కె బాలాజీకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోనగర్‌లో సులబ్‌కాంప్లెక్స్‌ను ఏర్పాటుచేయాలని, యూనియన్ సమావేశాల నిర్వహణకుపై సెంట్లుస్థలం కేటాయించాలన్నారు. మంచినీళ్ల పైపులైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. వీధి దీపాల కోసం ఏర్పాటు చేసిన ఆన్‌ఆఫ్ బాక్సుల పాడైపోయాయని, కొత్త బాక్సులను ఏర్పాటు చేయాలన్నారు. ఆటోనగర్‌ను విస్తరించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ హమీద్, అబ్దుల్ ఖుద్దూస్, నాయకులు ఆంజనేయులు, మొహిద్దీన్, నాగరాజు, రషీద్‌బేగ్, రెడ్డి నాగరాజు, త్రినాథ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం అందజేసిన యూనియన్ నేతలు

బదిలీల కోసం దరఖాస్తుల ఆహ్వానం

● ఎంపీడీవో బి.వై.విష్ణుప్రసాద్

గుడివాడ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలాల్లో పని చేసే సచివాలయ సిబ్బంది బదిలీ కోసం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో బి.వై.విష్ణుప్రసాద్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ అంశాలపై ఎంపీడీవో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలను కార్యదర్శులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. ఉపాధి హామీ పనులు పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు పడవద్దని, తగు సూచనలు కావాలంటే మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విష్ణుప్రసాద్

పామర్రు : గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో సంబంధిత గ్రామాలకు చెందిన సచివాలయ ఉద్యోగులు గ్రామ స్థాయిలోని అధికారపార్టీ రాజకీయనేతలతో పాటు, గ్రామ ప్రజాప్రతినిధులను కలుపుకుని ఎమ్మెల్యే కార్యాలయాలకు క్యూకడుతున్నారు. వారికి కావాల్సిన చోటుకు బదిలీ చేయించుకునేందుకు సిఫార్సు లేఖల కోసం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నిరీక్షణ చేస్తున్నారు.

మలేరియాపై అప్రమత్తత తప్పనిసరి

● ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అధికారిణి అఖిల

పమిడిముక్కల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) :ఇంటి చుట్టూ మురుగునీరు నిల్వకుండా చూసుకోవాలని, మలేరియపై ప్రతి ఒక్కరూ అప్రమత్తత కలిగి ఉండాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అధికారి అఖిల పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకుని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లల్లో ఫ్రిజ్‌లు, కూలర్లలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలనిసూచించారు.

అతిసారవ్యాధి పట్ల అప్రమత్తత ..

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అతిసార వ్యాధి పట్ల అప్రమత్తతగా ఉండాలన్నారు. 5 ఏళ్లలోపు పిల్లలకు ఈ వ్యాధి సోకితే తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలన్నారు. ఆహార పదార్థాలపై మూతలు ఉంచాలని తెలియజేశారు. వ్యాధి సోకితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. సాయిరా భాను, సూపర్‌వైజర్లు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

త్రిమూర్తులు మృతి తీరని లోటు : సీపీఎం

గుడివాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు మృతి కమ్యూనిస్ట్ ఉద్యమానికి తీరని లోటని సీపీఎం సీనియర్ నాయకుడు నీలం మురళీకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సుందరయ్యభవన్‌లో పార్టీ మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నీలం మాట్లాడుతూ నిస్వార్థంగా సమాజసేవకు పాటుపడిన వ్యక్తి త్రిమూర్తులు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పి.రజిని, లంకా సురేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం, నాయకులు నాగేంద్ర, నవ్యాంధ్ర కార్మిక సంఘం నాయకులు కొమ్మల సురేష్, తదితరులు పాల్గొన్నారు.


త్రిమూర్తులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కవిరాజ కళాభవనాన్ని అభివృద్ధిచేయాలి

● వైవీ మురళీకృష్ణ


వినతిపత్రం అందజేస్తున్న భవిష్యత్ భద్రతా దళం సభ్యులు

గుడివాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ స్వాధీనం చేసుకున్న కవిరాజ కళా భవనాన్ని అభివృద్ధిపరచి సాహిత్య, కళా కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు వైవీ మురళీకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో దళం సభ్యులు అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్రమణ చెర నుంచి కళాభవనాన్ని విడిపించారన్నారు. పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచి పూర్వవైభవాన్ని తీసుకువచ్చి సాహిత్య, సాంస్కృతిక, కళా కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు. కళాభవనాన్ని ప్రజలు శుభకార్యక్రమాలు నిర్వహించుకునే వీలుగా నిర్మాణం చేపట్టాలని, అందుబాటు ధరల్లో అద్దెకు ఇవ్వాలని కోరారు. దీంతో మున్సిపాలిటీకీ అదనపు ఆదాయం కూడా సమకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భవిష్యత్ భద్రతా దళం సభ్యులు తాహెర్‌భాషా, జి.పూర్ణచంద్రరావు, అక్బర్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల వద్దే రేషన్ పంపిణీ

నందివాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం మొబైల్ వ్యాన్ల ద్వారా రేషన్ ఇంటి వద్దకే అంటూ రేషన్ పంపకాలు జరిపింది. నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడి రేషన్ పంపకాలు రేషన్ డీలర్ల ద్వారా రేషన్‌దారులకు రేషన్ అందిస్తుందని సివిల్ సప్లయిస్ డీటీ కట్టా రామశివ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందివాడ మండలంలోని మొత్తం 11070 రేషన్ కార్డులు ఉండగా, వాటిలో 9925 కార్డుదారులు రేషన్ తీసుకున్నట్టు తెలిపారు. మొబైల్ వ్యాన్ ద్వారా రేషన్ పంపకాలు 80 శాతం వస్తే రేషన్ డీలర్ల ద్వారా 89 శాతం రేషన్ లబ్ధిదారులు తీసుకున్నట్లు తెలిపారు.

విద్యుత్‌కు అంతరాయం నేడు

గుడివాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వేమగిరి - సత్తెనపల్లి టీఎండీసీ లైన్ నుంచి ప్రతిపాదిత 400/220 కె.వి.ఎస్.ఎస్ గుడివాడ వరకు 400 కె.వి టీఎంఎంసీ ఎల్‌బిఎల్‌వో కొత్త ట్రాన్స్‌మిషన్ల స్ట్రింగింగ్ పనుల నేపథ్యంలో 17వతేదీ ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు స్ట్రింగింగ్ పనులు చేపట్టేందుకు సమాయత్తమైనటుట ఏపి ట్రాన్స్‌కో ఓ అండ్ ఎం నున్న, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడివాడలోని 220ఏవీ ఉపకేంద్రంలో 220కేవీ నున్న-గుడివాడ 1 అండ్ 2 ట్రాన్స్‌మిషన్ లైన్లు విద్యుత్ సరఫరాలను తాత్కాలికంగా ఆపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఎటువంటి అంతరాయం కలుగకుండా ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేశామన్నారు. అత్యవసర పరిస్థితి ఉత్పన్నమైతే మాత్రం 220కేవీ గుడివాడ ఉపకేంద్రం, 132కేవీ పామర్రు ఉపకేంద్రం, 132 కె.వి మచిలీపట్నం ఉపకేంద్రం, 132కేవీ అవనిగడ్డ ఉపకేంద్రం, 132కేవీ చిగురుకోట ఉపకేంద్రాలకు, పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

పకడ్బందీగా డీఎస్సీ పరీక్షలు

గుడ్లవల్లేరు : ఉపాధ్యాయ ఎంపిక పరీక్షలైన డీఎస్సీ పరీక్ష సోమవారం శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో రెండు విడతలుగా నిర్వహించారు. ఉదయం 301 మందికి గాను 293 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. రెండో విడత మధ్యాహ్నం 301 మందికి గాను 294 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని పరీక్షాకేంద్రం చీఫ్‌సూరింటెండెంట్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ తెలిపారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

కూచిపూడి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి సిద్ధేంద్ర జడ్పీ పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి ఎం.ఉదయభాస్కరరావు నగదు బహుమతులను సోమవారం పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో అందజేశారు. వక్కలగడ్డ మౌనిక హర్షితకు రూ.3 వేలు, అరుణకు రూ.2 వేలు, రమ్యకు రూ.1000లు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. హెచ్ఎం అమ్మిరెడ్డి అనుపల్లవి, ఉపాధ్యాయులు ఉషారాణి, కవిత, బండారు మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి : రోహిత్ మండవ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వారు మొవ్వ హోలీ స్పిరిట్ విద్యార్థి మండవ కిరణ్ కుమారుడు జ్ఞాన కుషాల్ నర్సరీ ఫీజుల నిమిత్తం రూ.16 వేలను పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. పుస్తకాలు, యూనిఫామ్, రవాణా ఖర్చులు సైతం ఆ విద్యార్థికి చెల్లించనున్నట్టు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. పదో తరగతి విద్య వరకు ఆ బాలుడికి అయ్యే ఖర్చును ట్రస్ట్ ద్వారా చెల్లించనున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు లక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదివి 583మార్కులు సాధించిన కందికొండ తేజస్వినిని జనసేన నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సోమవారం స్థానిక జనసేన నాయకులు సందు పవన్ వ్యక్తిగత కార్యాలయంలో తేజస్విని, ఆమె తండ్రి దుర్గలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.


నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న ఉదయభాస్కరరావు

గోడౌన్‌లో అపరాల చోరీ

పామర్రు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ధాన్యం, అపరాల వ్యాపారి దుకాణానికి చెందిన గోడౌన్‌లో అపరాలు చోరీకి గురైన సంఘటన జుజ్జవరంలో చోటుచేసుకుంది. జుజ్జవరానికి చెందిన మురాల రవి, జన్ను గోపి, శిమన్నారాయణలు కలసి అపరాలను దొంగిలించుకుపోయారని గంటలయ్య వెల్లడించారు. ఈ మేరకు ఆవ్యాపారి జోగిగంటలయ్య సోమవారం పామర్రు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదాపు 60 క్వింటాల బస్తాలను దొంగిలించుకుపోయినట్టు ఆఫిర్యాదులో వివరించారు. ఈమేరకు ఎస్సై రాజేంద్రప్రసాద్ కేసునమోదు చేసి సీసీ కెమెరాల ఆధారంగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణచేస్తున్నారు.

వివిధ శాఖల అధికారుల బదిలీ


రామకోటేశ్వరరావును సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

గుడివాడ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గుడివాడ తహసీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు బదిలీపై వత్సవాయి మండలం వెళ్తున్న సందర్భంగా సిబ్బంది తహసీల్దార్ రామకోటేశ్వరరావును సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సన్మానించారు. ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలానికి రామకోటేశ్వరరావు బదిలీ అయ్యారు. ఇంచార్జ్‌గా డిప్యూటీ తహసీల్దార్ టి.నాగసాయి కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇంచార్జ్ తహసీల్దార్ నాగసాయి కుమార్, ఆర్ఐ నాగబాబులు తహసీల్దార్‌ను అభినందించారు.

పెదపారుపూడి : పెదపారుపూడి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జె.విమాదేవి సోమవారం సాయంత్రం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మొవ్వ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పని చేస్తున్న విమాదేవి సాధారణ బదిలీల్లో భాగంగా పెదపారుపూడికి బదిలీ అయ్యారు. ఇంతవరకు ఇంచార్జ్ ఎంపీడీవోగా ఉన్న నందివాడ ఎంపీడీవో మల్లేశ్వరి నుంచి ఆమె చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ఎంపీపీ గోగం సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువాతో సత్కరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంలో ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి వంగా శ్రీనివాస్, ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారి విజయ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ బేగం, జూనియర్ అసిస్టెంట్ స్వరూప్, టైపిస్ట్ ఏసుబాబు శుభాకాంక్షలు తెలిపారు.


ఎంపీపీని సత్కరించి పూలమొక్క అందిస్తున్న నూతన ఎంపీడీవో విమాదేవి

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	102, 110, 121
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

మంత్రి రవీంద్రను విమర్శించే స్థాయి కిట్టూకు లేదు : టీడీపీ

మచిలీపట్నం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మంత్రి కొల్లు రవీంద్రను విమర్శించే స్థాయి పేర్ని కిట్టూకు లేదని మచిలీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని ధ్వజమెత్తారు. టీడీపీ కార్యాలయంలో జరిగిన సోమవారం అయన విలేకరులతో మాట్లాడారు. కొల్లు రవీంద్ర నిర్వహించిన ఉద్యమం వల్లే బందరు పోర్టు వచ్చిందన్నారు. వయసుకు మించి మాటలు, విమర్శలు చేయడం పేర్ని కిట్టుకు తగదన్నారు. టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బచ్చుల అనిల్‌కుమార్, నగర మాజీ కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు, రూరల్ మండల ప్రధాన కార్యదర్శి కాటం మధుసూదనరావు, తెలుగు మహిళలు లంకిశెట్టి నీరజ, పాలపర్తి పద్మజ, కర్రెడ్ల సుశీల, హైమావతి, వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ డీకే బాలాజీకి వినతిపత్రం అందజేస్తున్న జిల్లా రైతు సంఘ కార్యదర్శి నాగేశ్వరరావు

డ్రెయిన్ల పూడిక తీయించాలి

● కలెక్టర్‌కు రైతు సంఘ నాయకులు వినతి

మచిలీపట్నం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పలు డ్రెయిన్లలో పూడిక తీయించాలని, కాల్వలకు పడిన గండ్లను పూడ్చించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు కోరారు. కలెక్టర్ బాలాజీని సోమవారం నాగేశ్వరరావు కలిసి డ్రెయిన్ల సమస్యను వివరించారు. బుడమేరు, చంద్రయ్య, ఐనంపూడి, గుడ్లవల్లేరు, తుమ్మిడి, నాగేశ్వరరావుపేట, మల్లపురాజుగూడెం డ్రెయిన్లలో పూడి తీయించాలన్నారు. ఐనంపూడి, ఇరాలి డ్రెయిన్లు, పాలకాయ తిప్ప కరకట్ట దగ్గర ఔట్‌ఫాల్ స్లూయిస్ షట్టర్లు పునరుద్ధరించాలన్నారు. మినుములకు కేంద్ర ప్రభుత్వం క్వింటాకు రూ.7,400 ధర నిర్ణయించినప్పటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రంలో తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. గుమ్మడాల చెరువు దక్షిణాన ఉన్న మురుగు కాల్వ పూడిక తీయలేదని, పంటలు ముంపునకు గురవుతున్నాయని పిఎస్ఆర్ కృష్ణ, ఎండి అక్బర్ ఫిర్యాదు చేశారు.



చిల్లలవాగులో తూడు తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

పంటకాల్వలు, డ్రెయిన్ల అభివృద్ధికి చర్యలు

ఘంటసాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పంటకాల్వలు, డ్రెనేజీల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. చిల్లలవాగు డ్రెయిన్‌లో తూడు నిర్మూలన పనులను ఆయన పరిశీలించారు. జలవనరుల శాఖ ఆధ్వర్యంలో ప్రధాన పంట కాల్వలు, మురుగు కాల్వల్లో ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ నిధులతో తూటుకాడ, గుర్రపు డెక్క నిర్మూలన పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. శ్రీకాకుళం డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ అయిన పూడి భాను ప్రకాష్ మాట్లాడుతూ చిల్లలవాగు వేములపల్లి, యార్లగడ్డ, వక్కలగడ్డ, చల్లపల్లి, పుచ్చగడ్డ, దేవరకోట మీదుగా 12 కిలోమీటర్లు ప్రయాణించి గుండేరులో కలుస్తుందన్నారు. చిల్లలవాగులో తూటుకాడ, గుర్రపు డెక్క నిర్మూలనకు చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి సాయిబాబు, జనసేన నాయకులు మండలి వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.



తూడు తొలగింపు పనులను ప్రారంభిస్తున్న అర్జా నగేష్

ఇసుకపర్ర డ్రెయిన్‌లో తూడు తొలగింపు

పెడన రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇసుకపర్ర డ్రెయిన్‌లో తూడు తొలగింపు పనులను జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్ సోమవారం ప్రారంభించారు. డ్రెయిన్ తూడుతో నిండిపోవటంతో మురుగునీరు పారుదల లేక వ్యవసాయ సీజన్‌లో పంట పొలాలు మునిగిపోతుండడంతో తొలగింపు పనులు ప్రారంభించామని నగేష్ అన్నారు. మూడు కిలోమీటర్ల వరకు మిషన్ల ద్వారా తొలగిస్తామని, మిగిలినది డ్రోన్ ద్వారా నిర్మూలిస్తామని తెలిపారు. కొంగంచర్ల, గురివిందగుంట, పెనుమల్లి, నేలకొండపల్లి, చోడవరం, పుల్లపాడు గ్రామాల డ్రెయిన్‌లో కలుస్తుంది. తూడు తొలగింపు వలన పంటపొలాలకు నీటి ముంపు ఉండదని తెలిపారు. శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, పడమట ఘంటయ్య, నాయకులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం గుర్తింపు

పెడన, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : లజ్జబండ డ్రెయిన్‌లో ఆదివారం గల్లంతైన మురాల బాలచంద్రరావు (57) మృతదేహాన్ని సోమవారం గుర్తించారు. సింగరాయపాలెంకు చెందిన బాలచంద్రరావు ఆదివారం మధ్యాహ్నం తన కుమార్తె పుష్పకుమారిని చూసేందుకు ఈదుమూడి బయలుదేరాడు. మార్గమధ్యంలోని లజ్జబండ డ్రెయిన్‌ను దాటి అవతల గట్టుకు వెళ్లేందుకు తెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తూ బాలచంద్రరావు నుంచి జారి డ్రెయిన్‌లో పడి గల్లంతయ్యారు. తన తండ్రి ఎంతకూ రాకపోవడంతో కుమార్తె పుష్పకుమారికి అనుమానం వచ్చి పెడన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై జి. సత్యనారాయణ లజ్జబండ డ్రెయిన్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టగా కిలోమీటరు దూరంలో బాలచంద్రరావు మృతదేహం లభ్యమైంది. బాలచంద్రరావు మృతదేహాన్ని ఎస్సై సత్యనారాయణ పోస్టుమార్టం నిమిత్తం బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేవాలయ భూములు తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు అందజేసిన అర్జీని చూపుతున్న తుమ్మలపాలెం గ్రామస్థులు

మచిలీపట్నం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలం తుమ్మలపాలెం గ్రామంలో వెంకమ్మ పేరంటాలు దేవాలయానికి చెందిన పంట భూములను అడ్డదిడ్డంగా తవ్వేశారని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీకి గ్రామస్థులు బత్తిన హరిరామ్ తదితరులు విజ్ఞప్తి చేశారు. తుమ్మలపాలెం గ్రామంలో ఆరెకరాల 50 సెంట్లలో 60 సెంట్ల భూమిని ఆరడుగుల లోతు తవ్వేశారని, భూమి సాగుకు పనికిరాదని పేర్కొంటూ దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని, అయినా పట్టించుకోవడం లేదన్నారు. భూములు తవ్వుకుపోతున్నా ఈవో పట్టించుకోలేదన్నారు. కంకటావ, తరకటూరు గ్రామాల్లో కూడా దేవాలయాల భూముల్లో మట్టి తవ్వుకుపోయారని, మట్టి దొంగలపై చర్యలు తీసుకోవాలన్నారు.





లేడియాంప్థిల్ జూనియర్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న ఆర్డీవో స్వాతి, ఇంటర్ అధికారి సాల్మన్ రాజు, పక్కన రాంజీ ఉన్నత పాఠశాలలో యోగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

యోగాతో ఆరోగ్యం, ఏకాగ్రత

మచిలీపట్నం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) యోగ సాధన వల్ల ఆరోగ్యంతో పాటు ఏకాగ్రతను పెంపొందించుకోవచ్చని ఆర్డీవో కె.స్వాతి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా లేడీయాంప్థిల్ జూనియర్ కళాశాలలో 600 మంది విద్యార్థినులకు యోగా శిక్షణ నిర్వహించారు. ఆర్డీవో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్డీవో స్వాతి, ఇంటర్ జిల్లా అధికారి సాల్మన్‌రాజు పాల్గొని వృక్షాసనం వేశారు. బాలికలు యోగా సాధన చేయడం వల్ల రుతుక్రమం సక్రమంగా జరుగుతుందన్నారు. విద్యార్థులు ప్రాణాయామం చేయడం వల్ల జ్ఞాపకశక్తి పెంపొందుతుందన్నారు. ఇంటర్ జిల్లా అధికారి సాల్మన్‌రాజు మాట్లాడుతూ, యువతీ యువకులు యోగా సాధన వల్ల సులభంగా తమ పనులు తాము చేసుకుంటూ విజయాలు సాధిస్తారన్నారు. లేడియాంప్థిల్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లంకిశెట్టి హరనాథ్, కల్యాణి, స్పందన తదితరులు పాల్గొన్నారు. మచిలీపట్నం ప్రభుత్వ రాంజీ హైస్కూల్‌లో నిర్వహించిన యోగా శిక్షణా తరగతుల్లో బ్రా మరి ప్రాణాయామం, కపాలభాతి, ధ్యానం చేయించారు. యోగశిక్షణా తరగతుల్లో మానసిక దివ్యాంగుడు హరి పాల్గొని ఎంతో చక్కగా ఆసనాలు, ప్రాణాయామం చేశాడు. దివ్యాంగుని బందరు డీవైఈవో సింగ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.



డాక్టర్ మల్లిఖార్జునుడు రూపొందించిన యోగాంధ్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

యోగాంధ్రను విజయవంతం చేయాలి : కలెక్టర్

మాతృమూర్తి సేవా ట్రస్టు కన్వీనర్ డాక్టర్ మల్లిఖార్జునుడు రూపొందించిన యోగాంధ్ర కరపత్రాలను సోమవారం కలెక్టర్ బాలాజీ ఆవిష్కరించారు. ఈనెల 21న జరిగే యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవ డైరెక్టర్, స్టార్ కళాశాల అధినేత శ్రీరామ్, సత్యనారాయణ, సాంబశివరావు, సారధి, కొండా, శివ తదితరులు పాల్గొన్నారు.



గూడూరు మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సంగా మధుసూదనరావు

సమస్యలు త్వరగా పరిష్కరించాలి

గూడూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు త్వరగా పరిష్కారమయ్యేలా కృషి చేయాలని ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి తగు సూచనలు చేశారు. జడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, తహసీల్దార్ డి. రాజ్యలక్ష్మి, ఈవోపీఆర్డీ బి. రాజేశ్వరి, ఏవో రామకృష్ణ, వనజ, గూడూరు మండల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కానూరు పాఠశాలలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్, రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న గ్రామస్థులు

తల్లికి వందనం ఘనత కూటమిదే

మచిలీపట్నం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులందరికీ తల్లికి వందనం ఇచ్చి కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద సోమవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు తల్లిదండ్రులతో కలిసి జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ పాలాభిషేకం చేశారు. గోపు సత్యనారాయణ మాట్లాడుతూ, గతంలో జగన్‌రెడ్డి ప్రభుత్వం కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అమ్మఒడి ఇచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చదువుకుంటున్న ప్రతి ఒక్క విద్యార్థికి తల్లికి వందనం ఇస్తున్నారన్నారు. కూటమి నాయకులు దివి మహేష్, పీతా రాము, ఏడుకొండలు, కొండలరావు, కొక్కిలిగడ్డ ప్రభుదాస్, ఇమానియేల్, వెంకటేశ్వరరావు, రాజేష్, శ్రీదేవి పాల్గొన్నారు.

తెలుగు ఫాంట్స్ రూపకల్పనలో బుద్ధప్రసాద్ కృషి అభినందనీయం



తెలుగు వెలుగు పుస్తకాన్ని ఎమ్మెల్యే మండలికి అందజేస్తున్న సుధీర్ రెడ్డి

అవనిగడ్డ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తెలుగు ఫాంట్స్ రూపకల్పనకు ఉమ్మడి తెలు గు రాష్ట్రాల అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా మండలి బుద్ధప్రసాద్ చేసిన కృషి అభినందనీయమని మలేషియాలోని కస్తూరి విజయం పబ్లికేషన్స్ సహ వ్యవస్థాపకులు కామిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నా రు. అవనిగడ్డలో మండలి బుద్ధప్రసాద్‌ను ఆయన సోమవారం మర్యా ద పూర్వకంగా కలిసి సత్కరించి తెలుగు వెలుగు పుస్తకాన్ని బహూకరించారు. సుధీర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగులోనే గూగుల్ ఫాంట్స్, స్పెల్ చెకర్ అవసరాన్ని గుర్తించి బుద్ధప్రసాద్ విశేషంగా కృషి చేశారని అన్నారు. నాటి ఫాంట్స్‌లో ఒకటైన మండలి ఫాంట్ ద్వారా తమ పబ్లికేషన్స్ నుంచి 125 పుస్తకాలను 100 దేశాల్లో ప్రచురించామని తెలిపారు. తెలుగు రచనలు, పరిశోధనా గ్రంథాలు ఉన్నాయన్నారు.

పట్టాభి భవన నిర్మాణంపై హైకోర్టు ఉత్తర్వుల అమలుకు చర్యలు తీసుకోవాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు ఉత్తర్వులు అమలు చేసి భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి నగర పాలక సంస్థ అనుమతులు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ సోమవారం కలెక్టర్ డీకే బాలాజీని కలిసి కోరారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్మించే స్మారక భవన నిర్మాణానికి వైసీపీ కార్పొరేటర్లు అడ్డుతగలడం సిగ్గుచేటన్నారు. హైకోర్టు ఉత్తర్వులను కూడా వైసీపీ కార్పొరేటర్లు అమలు చేయకపోవడం ప్రజలు గమనిస్తున్నారని దుయ్యబట్టారు. మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు నియోజకవర్గ, జిల్లా మహానాడులో తీర్మానం పెట్టి పార్టీ అధిష్ఠానానికి పంపించడం జరిగిందన్నారు. టీడీపీ నాయకులు ఇమ్మాబత్తుల దిలీప్‌కుమార్, పిప్పళ్ళ వెంకట కాంతారావు, పి.వి. ఫణికుమార్ పాల్గొన్నారు.



డివిజనల్ పంచాయతీ అధికారి రజావుల్లాకు కార్యదర్శుల సంఘం అభినందనలు

మోపిదేవి జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం డివిజనల్ పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎండి.రజావుల్లాను డివిజన్ పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు సోమవారం కలసి అభినందనలు తెలియజేశారు. మచిలీపట్నం డివిజన్ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు పి.వి.మాధవేంద్రరావు, జాయింట్ సెక్రటరీ కె.రామకోటేశ్వరరావు, మాజీ అధ్యక్షులు కె.నరసింహారావు, సంఘం సభ్యులు సిహెచ్.శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు ఆయనను కలసిన వారిలో ఉన్నారు. పంచాయతీల అభివృద్ధిలో ఆదర్శంగా ఉండేలా కృషి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆయన సూచించారు.

సత్యసాయి ప్రేమ రథయాత్ర రేపటి నుంచి

చల్లపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : శ్రీసత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయి బాబా శత జయం తి వేడుకల్లో భాగంగా జిల్లాలో ఈనెల 18, 19, 20, 21 తేదీల్లో శ్రీసత్యసాయి ప్రేమ రథయాత్ర జరుగుతుందని జిల్లా సమన్వయకర్త సనకా పూర్ణచంద్రరావు తెలిపారు. సేవాసంస్థల ప్రతినిధులు డాక్టర్ కంఠంరాజు చంద్రశేఖర్, రాయపాటి రాధాకృష్ణ, వక్కలగడ్డ ప్రసాద్ సోమవారం చల్లపల్లిలో కరపత్రాలు పంపిణీ చేశారు. రథయాత్రకు స్వాగతం పలికి విజయవంతం చేయాల్సిందిగా భక్తులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం 18వ తేదీ మచిలీపట్నం, పెడన, లంకపల్లి, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డలో, 19వ తేదీ అవనిగడ్డ నుంచీ ప్రారంభమై కోడూరు, నాగాయలంక మండలాల్లోని గ్రామాల్లో పర్యటించి తిరిగి అవనిగడ్డ మీదుగా చల్లపల్లి, వక్కలగడ్డ, దేవరకోట, ఘంటసాల మీదుగా కొడాలి, మొవ్వ, కూచిపూడి వరకు సాగుతుందన్నారు.



ఏవో మురళీకృష్ణకు సత్కారం

ఘంటసాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి పని చేస్తే ప్రజల మన్ననలు పొందుతారని కృష్ణా మిల్క్ యూనియన్ కార్యవర్గ సభ్యులు వేమూరి సాయి వెంకట రమణ పేర్కొన్నారు. ఘంటసాలపాలెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బదిలీపై వెళ్లిన ఏవో కె.మురళీకృష్ణను ఘనంగా సత్కరించారు. వీఆర్వో వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బోలెం అర్జునరావు, రిటైర్డ్ లెక్చరర్ మధుసూదనరావు, దోనె వెంకటేశ్వరరావు, మూల్పూరి వెంకయ్య, గొరుముచ్చు శ్రీనివాసరావు, వేమూరి రామారావు, ములగలపల్లి ప్రసాద్, గొరుముచ్చు పాపారావు పాల్గొన్నారు.

సంచారజాతుల అభివృద్ధికి చొరవ చూపాలి

చల్లపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల సడలింపులతో సంచార జాతుల ప్రజల అభివృద్ధికి అధికారులు, ఉద్యోగులు కృషిచేయాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్‌బాబు కోరారు. కోమలా థియేటర్ సమీపంలో మూడేళ్లుగా రోడ్డుపక్కనే నివసిస్తున్న మూడు సంచార జాతుల కుటుంబాల దయనీయ జీవన స్థితిగతులను సోమవారం చల్లపల్లి తహసీల్దార్ డి.వనజాక్షి దృష్టికి తీసుకువెళ్లారు. చిన్నారులకు పదేళ్ల దాటుతున్నప్పటికీ పాఠశాల ముఖం చూడకపోవటం, ఆధార్ కార్డులు లేవనే కారణంతో ప్రభుత్వ పథకాలు అందటంలేదని తెలిపారు. స్పందించిన తహసీల్దార్ వారికి నివాస, పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

నాగాయలంక, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పెదపాలెం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ బదిలీపై ఎదురుమొండి పాఠశాలకు వెళ్తున్న చీర్ల నాగప్రసాద్ ను సోమవారం పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ కైతేపల్లి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

ఎస్పీకి బాధితుల వినతులు

మచిలీపట్నం టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎస్పీ ఆర్. గంగాధరరావు పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఎస్పీ వినతిపత్రాలు స్వీకరించారు.

● వివాహం జరిగి నాలుగేళ్ళయిందని, పిల్లలు పుట్టలేదనే కారణంతో తన భర్త విడాకులు ఇస్తానంటున్నాడని గుడివాడకు చెందిన పద్మ తన గోడు వినిపించుకుంది.

● తన భార్య ఏడాది క్రితం మృతి చెందిందని, ఇద్దరు పిల్లలకు ఆస్తిని పంచేశానని, ఎవరూ తన బాగోగులు చూ డటం లేదని చల్లపల్లికి చెందిన వృద్ధుడు వీరయ్య ఫిర్యాదు చేశారు.

● ఉద్యోగం ఇప్పిస్తానని తన బంధువులు మోసం చేశారని గన్నవరానికి చెందిన వనజ ఫిర్యాదు చేశారు.

● ఇంటికి వెళ్లేందుకు దారి ఇవ్వడం లేదని, అదేమని అడిగితే బెదిరిస్తున్నారని, తనకు రక్షణ కల్పించాలని నాగాయలంకకు చెందిన శరత్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు.

గల్లంతైన యువకుడి మృతదేహం గుర్తింపు

ఘంటసాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : గల్లంతైన యువకుడి మృతదేహాన్ని సోమవారం సాయంత్రం గుర్తిం చారు. శ్రీకాకుళం గ్రామానికి చెందిన ఆత్మూరి ఫణి కుమార్ (25) ప్రమాదవశాత్తు కృష్ణానదిలో పడి గల్లంతైన విషయం పాఠకులకు విదితమే. ఎస్సై ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు, గ్రామస్థులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కూడా కృష్ణానదిలో గాలింపు చర్యలు చేపట్టగా, 24 గంటల తర్వాత మృతదేహం కన్పించింది. ఫణికుమార్ మృతదేహాన్ని చూసి కుటుంబసభ్యులు, గ్రామస్థులు, స్నేహితులు శోకసంద్రంలో మునిగిపోయారు. శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యు లు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), గ్రామ ప్రముఖులు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

మండల పరిషత్ ఏవోగా సత్యనారాయణ

కోడూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏవో)గా సత్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో సుధా ప్రవీణ్, గ్రామపంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు, తాతారావు ఆయనను దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఇప్పటి వరకు ఏవోగా బాధ్యతలు నిర్వహించిన పాండురంగారావు మూడు నెలల క్రితం మోపిదేవికి బదిలీపై వెళ్లారు.